తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ వ్యవసాయమే ముద్దు!

మనం తింటున్నది ఆహారమా? అనారోగ్యానికి ఆహ్వానమా? భూమిని కాపాడితేనే మనిషి బతుకుతాడు.. రైతును ఆదరిస్తేనే ఆరోగ్య భారత్ సాధ్యం! ఒకప్పుడు వ్యవసాయం అంటే ప్రకృతితో ముడిపడిన జీవన విధానం. పశు...

6వ పేజీ



ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం

(ఆదిలాబాద్, సాక్షర) దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను నేతలు కొనియాడారు.భారతదేశపు తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్...

5వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 286 శుక్రవారం, నవంబర్ 20, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00



కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాటలను పరిశీలిస్తాం

పేజీ 4



మంత్రి పొన్నం ను కలిసిన ఆర్టీసీ ఎండి

పేజీ 3



ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను

పేజీ 3



యాదగిరిగుట్టలో ప్రారంభమైన కోటి పుష్పార్చన

పేజీ 4

భారత్ ఇప్పుడు సరికొత్త ఆట ఆడుతోంది



దేశం ఇప్పుడు సరికొత్త లక్ష్యాలతో, కొత్త నిబంధనలతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్ @ 2047: వాయిస్ ఆఫ్ యూత్' వర్క్‌షాప్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన ఆయన, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాల వ్యవహారశైలిని ప్రముఖ వీడియో గేమ్ 'గ్రాండ్ థెఫ్ట్ ఆటో' (జీటీఏ)తో పోల్చారు. "వీడియో గేమ్‌ల ప్రపంచంలో జీటీఏ గురించి మనకు తెలుసు. అందులో ప్లేయర్ ఏమైనా చేయవచ్చు. ఏది పడితే అది లాక్కోవచ్చు, దేన్నైనా నాశనం చేయవచ్చు. అదే విధమైన 'అపరిమిత' స్వేచ్ఛను కొందరు వ్యక్తులు దేశానికి వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారు. సాంకేతికతను ఆసరాగా చేసుకుని ఎవరిపై పడితే వారిపై క్యారెక్టర్ అసాసినేషన్ ప్రచారం చేస్తున్నారు. ఫేక్ వీడియోలతో తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు" అని మండిపడ్డారు. కేవలం రాజకీయ శత్రుత్వంతో కొందరు వ్యక్తులు, కొన్ని పార్టీలు దేశ మనోధైర్యాన్ని, ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తూ అన్ని హద్దులూ దాటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, భారత్ పాత పద్ధతులను దాటి సరికొత్త ఆట ఆడుతోందని మోదీ పేర్కొన్నారు. నేడు దేశంలోని ప్రతి యువకుడు సరికొత్త ఆశయాలతో, సరికొత్త లక్ష్యంతో ఆలోచించాలని, నేటి భారత్‌కు కొత్త లక్ష్యాలు, కొత్త రూల్స్ ఉన్నాయని స్పష్టం చేశారు. రాబోయే 25 ఏళ్ల కాలం దేశ చరిత్రలో కీలకమైన 'అమృత కాలం' అని, 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల వేళ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ప్రధాని వివరించారు. గవర్నర్లు, వైస్ ఛాన్సలర్లు పాల్గొన్న ఈ వర్క్‌షాప్ ద్వారా దేశ నిర్మాణానికి అవసరమైన వినూత్న ఆలోచనలను ప్రత్యేక పోర్టల్ ద్వారా పంచుకోవాలని ప్రధాని యువతకు పిలుపునిచ్చారు.

చారిత్రక భేటీ



(షెన్‌జెన్, సాక్షర): ప్రపంచ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తొలిసారిగా త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. చైనాలోని షెన్‌జెన్‌లో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఎపెక్) సదస్సు సందర్భంగా గురువారం ఈ భేటీ జరిగింది. ప్రపంచంలోని మూడు అతిపెద్ద అణ్వస్త్ర దేశాల అధినేతలు ఒకే వేదికపై సమావేశమవడం ఇదే ప్రప్రథమం. ఈ సమావేశానికి ముందు బుధవారం, షెన్‌జెన్ విమానాశ్రయంలో ట్రంప్‌కు జిన్‌పింగ్ సైనిక వందనంతో ఘన స్వాగతం పలికారు.

పూర్తిగా 3 లో

రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు



- గజాలను కూడా వదిలిపెట్టడం లేదు
- ట్రక్ పార్కు భూమి వేలాన్ని రద్దు చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

(హైదరాబాద్, సాక్షర): కూకట్పల్లి ట్రక్ పార్కింగ్ భూమి అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో హరీష్ రావుమాట్లాడుతూ.

3 లో

విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం



- తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూత
- హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయిందంటూ కేసీఆర్ ఆవేదన

మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూశారు.

2 లో

టీ కాంగ్రెస్ లో అంతర్మథనం !



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అంతర్గత విమర్శలతో ఎదుర్కొంటోంది. మరో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.ఈ విమర్శలు రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టులపై అవినీతి ఆరోపణలతో మొదలయ్యాయి. మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్షపై ఆరోపణలు చేశారు. మునుగోడులో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

4 లో

ఒక్క రాత్రిలో 4,250 మంది కోటీశ్వరులు.. ఆంత్రోపిక్ ఐపీవోతో కాసుల వర్షం!



కృత్రిమ మేధ (ఏఐ) సృష్టిస్తున్న సంపద సిలికాన్ వ్యాలీ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రికార్డులను తిరగరాస్తోంది. ప్రముఖ ఏఐ మోడల్ 'క్లాడ్' మాతృసంస్థ ఆంథ్రోపిక్ పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) ద్వారా ఏకంగా 4,250 మంది ఉద్యోగులు రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మారిపోయారు. కంపెనీలో పనిచేస్తున్న సుమారు 70 శాతం మంది సిబ్బంది ఒక్క దెబ్బతో కోట్ల రూపాయల సంపదకు అధిపతులయ్యారు. నాస్‌డాక్‌లో లిస్టింగ్‌కు సిద్ధమైన ఈ సంస్థ ఒక్కో షేరు ధరను అంచనాలకు మించి 83 డాలర్లు (సుమారు రూ.

పూర్తిగా 3 లో

దారుణంగా పడిపోతున్న నీటి నిల్వలు



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ నగరానికి ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపించబోతున్నది. ఈ నేపథ్యంలో, భారతదేశంలోని ప్రధాన నగరాల్లో నీటి సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డిసెంబర్ నాటికి, హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే సింగూర్ మరియు మంజీరా కుంటలు పూర్తిగా ఖాళీ కావచ్చు.ప్రస్తుతం, హైదరాబాద్ రోజుకు సుమారు 600 మిలియన్ లీటర్ల నీటి కొరతను ఎదుర్కొంటోంది. ఈ కొరత వచ్చే నెలల్లో 1,000 మిలియన్ లీటర్లను మించవచ్చు. హైదరాబాద్‌లో నీటి సంక్షోభం ఇతర మెట్రో నగరాల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేయబడుతోంది.నగరానికి రోజుకు సుమారు 3,200 మిలియన్ లీటర్ల నీరు అవసరం, అయితే ప్రస్తుత నీటి సరఫరా 2,600 మిలియన్ లీటర్లకు పరిమితం అయింది. సింగూర్ మరియు మంజీరా కుంటలు కలిపి 480 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నాయి, ఇది నగరానికి అవసరమైన మొత్తం నీటి సరఫరా లో 20% కంటే ఎక్కువ. వర్షపాతం తగ్గడం వల్ల ఈ కుంటలలో నీటి స్థాయిలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి.

పూర్తిగా 4 లో

హరీశ్ రావు అవినీతిపై చర్యలేవి?



హైదరాబాద్, సాక్షర:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన వేళ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) తాను అందజేసిన ఫిర్యాదు పత్రాలను ఈరోజు ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు."అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారు సీఎం గారూ?" అంటూ కవిత నేరుగా రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 14న సీఎంఓకు సమర్పించిన ఈ లేఖలను అధికారులు నవంబర్ 18న స్వీకరించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ మార్పులు, పంప్ హౌస్ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని ఆమె ఆరోపించారు."సిద్ధిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో జరిగిన అవినీతి, డిజైన్ మార్పు, నాణ్యతా లోపాలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చిన అంశాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వరకు నీటిని తరలించే కాలువ డిజైన్‌లో మార్పులు, పంప్ హౌస్ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం" అని కవిత తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

అక్వాన్ తుపానుపై ఐఎండీ తాజా హెచ్చరిక..!



(వైజాగ్, సాక్షర): :నర్సాపూర్–పూరి మధ్య గోపాల్‌పూర్‌కు తూర్పున తీరం దాటే అవకాశం.. విశాఖ లోతట్టు ప్రాంతాలకూ సముద్రపు నీటి ముప్పు.బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుపాను 'అక్వాన్' ఉత్తరం వైపు కదులుతోంది. నవంబర్ 19 ఉదయం 8:30 గంటల పరిశీలన ప్రకారం గంటకు 15 కి.మీ వేగంతో కదులుతూ 14.9° ఉత్తర అక్షాంశం, 85.3° తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది.ఆ సమయంలో నర్సాపూర్‌కు 420 కి.మీ, కళింగపట్నానికి 400 కి.మీ, గోపాల్‌పూర్‌కు 490 కి.

పూర్తిగా 3 లో

సంపాదకీయం

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్



అమెరికాలో ఉన్నత విద్య , ఆపై మంచి ఉద్యోగం.. ఇది ప్రపంచంలోని చాలా మంది డ్రీమ్. దశాబ్దాలుగా భారతీయులకు కూడా అమెరికా ఫస్ట్ చాయిస్. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతున్నట్లు కనిపిస్తోంది. వీసా అనిశ్చితులు, క్లిష్టమైన ఉద్యోగ మార్కెట్, మారుతున్న వలస విధానాల కారణంగా అమెరికాలో చదువుకోవాలనే విద్యార్థుల నిర్ణయాలు సంక్లిష్టంగా మారాయి. ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరంలో అమెరికా విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గి 3,39,435కు చేరుకుంది. ఇదే సమయంలో చైనా విద్యార్థుల సంఖ్య 4 శాతం తగ్గి 2,54,458కి పరిమితమైంది.అన్నింటికంటే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికా విద్యాసంస్థల్లో కొత్తగా చేరుతున్న విద్యార్థుల సంఖ్య. 2025-26లో అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 18 శాతం పడిపోయి 2,28,123కు చేరాయి. గతంలో చేరిన మొత్తం విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, ఈ గణాంకాలు విద్యార్థులు ఇప్పటికీ అమెరికాను ఎంచుకుంటున్నారా? లేదా? అనేదానికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తాయి.'ఫాల్ 2026 స్నాప్‌షాట్' నివేదిక ప్రకారం.. ఈ తగ్గుదల మరింత కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న విద్యాసంస్థల వివరాల ప్రకారం.. గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 15 శాతం, అండర్ గ్రాడ్యుయేట్ల సంఖ్య 3 శాతం, ఓపీటీ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే కొత్త అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 15 శాతం తగ్గాయి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ నవంబర్ 16న విడుదల చేసిన 'ఓపెన్ డోర్స్ 2026' నివేదిక ప్రకారం.. 2025-26లో అమెరికా ఉన్నత విద్యాసంస్థల్లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 3 శాతం తగ్గి 11,46,163కు చేరుకుంది. 800కు పైగా విద్యాసంస్థలపై నిర్వహించిన ప్రత్యేక 'ఫాల్ 2026 స్నాప్‌షాట్' సర్వేలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 9 శాతం తగ్గగా, కొత్త ప్రవేశాలు 15 శాతం పడిపోయినట్లు నమోదైంది.భారత్ విషయానికొస్తే ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఏడాది క్రితం అంటే 2024-25లో అంతకుముందు ఏడాది కంటే 10 శాతం వృద్ధితో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 3,63,019 మంది విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. వరుసగా మూడో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి అమెరికాకు అత్యధిక మంది విద్యార్థులను పంపే దేశంగా భారత్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ, ఆ వేగం మాత్రం మందగించింది. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో దాదాపు 52 శాతం మంది భారత్, చైనాకు చెందినవారే.భారతీయ విద్యార్థులు అత్యధికంగా ఇష్టపడే ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కోర్సులు ఉండే 'గ్రాడ్యుయేట్' (మాస్టర్స్) స్థాయిలోనే ఈ తగ్గుదల ఎక్కువగా ఉంది. భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య ఏకంగా 34 శాతం పడిపోయి 1,16,609కు చేరగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలు కేవలం 1 శాతం తగ్గి 39,711 వద్ద నిలిచాయి.ఈ వ్యత్యాసం చాలా విషయాలను స్పష్టం చేస్తోంది. చాలా భారతీయ కుటుంబాలకు అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ అంటే కేవలం చదువుకు సంబంధించిన పెట్టుబడి మాత్రమే కాదు.. అది వృత్తిపరమైన అనుభవం, మెరుగైన సంపాదన, దీర్ఘకాలిక విదేశీ కెరీర్‌కు ఒక మార్గం. అమెరికాలో చదువు ఖర్చు భారీగా పెరుగుతున్న తరుణంలో, చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకం సన్నగిల్లడం విద్యార్థులను ఆలోచనలో పడేస్తోంది.ఇప్పటికే అమెరికాలో చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నవారు లేకపోయి ఉంటే, భారతీయ విద్యార్థుల సంఖ్యలో ఈ తగ్గుదల మరింత తీవ్రంగా ఉండేదని నిపుణులు చెబుతున్నారు. చదువు తర్వాత తాత్కాలికంగా పనిచేసేందుకు వీలుకల్పించే ఓపీటీ కింద ఉన్న భారతీయుల సంఖ్య 27 శాతం పెరిగి 1,82,201కు చేరుకుంది. నివేదికలోని మొత్తం భారతీయ విద్యార్థుల్లో వీరే సగానికి పైగా ఉన్నారు.మరోవైపు, చైనా విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల కొంత తక్కువగానే ఉంది. చైనా గ్రాడ్యుయేట్ విద్యార్థులు 5 శాతం తగ్గి 1,14,043కు, అండర్ గ్రాడ్యుయేట్లు 5 శాతం తగ్గి 74,594కు, ఓపీటీలో ఉన్నవారు 1 శాతం తగ్గి 61,545కు పరిమితమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల విద్యార్థులను కలిపి చూస్తే, మాస్టర్స్ విద్యార్థులు 22 శాతం తగ్గడంతో మొత్తం గ్రాడ్యుయేట్ ప్రవేశాలు 13 శాతం పడిపోయి 4,23,078కు చేరాయి. అయితే డాక్టోరల్ (పీహెచ్‌డీ) విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరగగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల్లో పెద్దగా మార్పు లేకుండా 3,56,165 వద్ద స్థిరంగా ఉన్నాయి.ఓపీటీ గణాంకాలు ప్రత్యేకంగా గమనించాల్సినవి. ఎందుకంటే గత కొన్నేళ్లుగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉండటంతో 2025-26లో ఓపీటీలో ఉన్నవారి సంఖ్య 14 శాతం పెరిగి 3,35,785కు చేరుకుంది. అయితే, ఈ విభాగం కూడా ఇప్పుడు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైందని తాజా సర్వే సూచిస్తోంది.అమెరికా విశ్వవిద్యాలయాలకు ఈ పరిణామాలు కేవలం అడ్మిషన్లకే పరిమితం కావు. అంతర్జాతీయ విద్యార్థులు వాటికి గణనీయంగా ఆదాయం, పరిశోధన ప్రతిభ, నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లను అందించే ప్రధాన వనరులు. అమెరికా వాణిజ్య శాఖ ప్రకారం.. 2025లో అంతర్జాతీయ విద్యార్థులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు దాదాపు 56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చారు.అందుకే అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించాలనే ఆసక్తి అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఇంకా బలంగానే ఉంది. 'ఫాల్ స్నాప్‌షాట్' సర్వేలో 75 శాతం విద్యాసంస్థలు క్యాంపస్‌లో అంతర్జాతీయ దృక్పథం అవసరమని పేర్కొనగా, 60 శాతం సంస్థలు విదేశీ విద్యార్థుల ఆర్థిక సహకారాన్ని అంగీకరించాయి. ఏకంగా 91 శాతం విద్యాసంస్థలు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపాయి. 75 శాతం సంస్థలు కంప్యూటర్ సైన్స్‌ను, చెరో 59 శాతం సంస్థలు ఇంజనీరింగ్, బయోలాజికల్ సైన్సెస్‌ను తమ ప్రధాన రిక్రూట్‌మెంట్ విభాగాలుగా గుర్తించాయి. 2025-26లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 57 శాతం మంది స్టెమ్ (STEM) కోర్సుల్లోనే ఉన్నారు. ఇందులో మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో 2,86,168 మంది, ఇంజనీరింగ్‌లో 2,14,193 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దావూద్ ఇబ్రహీం భవనం కూల్చివేత

(ముంబై, సాక్షర): హజ్ యాత్రికులకు తాత్కాలిక విడిది కేంద్రంగా 1939లో దక్షిణ ముంబయి పక్మోడియా స్ట్రీట్‌లోని 'హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా'ను నిర్మించారు. కానీ గడిచిన ఐదు దశాబ్దాల్లో అది పరారీలో ఉన్న అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని.. రోడ్డు విస్తరణ కోసం కూల్చివేయడానికి ముంబయి నగరపాలక సంస్థ సిద్ధమవుతుంది. మొదటి అంతస్తులోని 10 గదులు, గ్రౌండ్ ఫ్లోర్‌లోని వివాదాస్పద 'ప్రార్థనా మందిరాన్ని' కూల్చివేయడానికి సన్నాహాలు జరుగుతున్నప్పటికీ, ఈ కట్టడం ఇప్పటికీ అండర్‌వరల్డ్ చరిత్రకు ఒక ఆనవాలుగా నిలిచింది.మరోవైపు, దీనికి అసలు యజమాని ఎవరనే దానిపై న్యాయపోరాటం కూడా నడుస్తోంది. ఈ పబ్లిక్ ఛారిటీ గెస్ట్‌హౌస్‌లోకి ఒక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కొడుకు అద్దెదారుగా ప్రవేశించి, ఆపై దానిని శాశ్వతంగా ఆక్రమించుకున్నాడు. అలా దావూద్ ఇబ్రహీం నేర సామ్రాజ్యమైన 'డి-కంపెనీ'కి ఇది ప్రధాన కార్యాలయంగా మారిపోయింది.దావూద్ ఇబ్రహీం కస్కర్ మొదట్లో తన తల్లిదండ్రులు హెడ్ కానిస్టేబుల్ ఇబ్రహీం కస్కర్, అమీనా బీ, తన తోబుట్టువులతో కలిసి ముసాఫిర్‌ఖానా రెండో అంతస్తులో నివసించేవాడు. 1970వ దశకం చివరలో, 1980లలో ముంబయి అండర్‌వరల్డ్‌లో దావూద్ ఇబ్రహీం ప్రాబల్యం పెరగడంతో, అద్దె ఒప్పందం కాస్తా కనుమరుగైంది. అతను ఆ భవనాన్ని కబ్జా చేసి రెండో అంతస్తు మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్‌కు చెందిన ఈ యాత్రికుల విడిది అతడి నివాసంగా, కార్యాలయంగా, అప్రకటిత ప్రధాన కార్యాలయంగా మారిపోయింది.ఈ స్థలంపై దావూద్‌కు ఎలాంటి హక్కు ఉన్నట్లు ఏ పత్రాలూ లభించలేదు. దావూద్ ఇబ్రహీంకు గానీ, కస్కర్ కుటుంబంలోని ఏ ఒక్కరికి గానీ ఈ ఆస్తిపై కనీస రిజిస్ట్రేషన్ గానీ, యాజమాన్య హక్కుల ఆధారాలు గానీ లేవని ప్రభుత్వ సంస్థల రికార్డులు, న్యాయపత్రాలుస్పష్టం చేస్తున్నాయిగ్రౌండ్ ఫ్లోర్‌లోని 32 వాణిజ్య దుకాణాలు, పై అంతస్తులలోని 19 నివాస గదులు సాధారణ అద్దెదారులు, దుకాణదారుల ఆధీనంలో ఉండగానే, కేవలం ఆక్రమణ బలంతోనే ఈ ముఠా పక్మోడియా స్ట్రీట్ నుంచి చక్రం తిప్పింది. స్మగ్లింగ్ వస్తువులను దాచడానికి కూడా ఈభవనాన్ని ఉపయోగించేవారు1986లో దావూద్ ఇబ్రహీం భారత్ విడిచి పారిపోయిన తర్వాత కూడా అతడి అనుచరులు ఈ భవనంలో చురుకుగా ఉండేవారు. ఆ తర్వాత 1993 ముంబయి వరుస బాంబు పేలుళ్ల కుట్ర జరిగిన ప్రధాన కేంద్రాల్లో ఇది కూడా ఒకటిగా నిలిచింది. 1993 పేలుళ్ల తర్వాత, కస్కర్ కుటుంబం చెర నుంచి ఈ భవనాన్ని విడిపించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం సుదీర్ఘ ప్రయత్నాలు మొదలుపెట్టింది. దావూద్ తల్లి అమీనా బీ, ఇతర కుటుంబ సభ్యులు అక్కడే నివసిస్తూ వచ్చారు. ఆ తర్వాతి కాలంలో దావూద్ సోదరుడు ఇక్బాల్ కస్కర్ దీనిని వినియోగించుకున్నట్లు వార్తలు వచ్చాయి. చివరకు టెర్రరిస్ట్ అండ్ డిస్రప్టివ్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్ నిబంధనల కింద దావూద్ ఆధీనంలోని రెండో అంతస్తును కోర్టు జప్తు చేసింది.1998, 2018 మధ్య కాలంలో స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్చేంజ్ మానిప్యులేటర్స్ యాక్ట్ కింద ఈ కుటుంబ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు చేపట్టింది. ఈ ఉత్తర్వులపై అమీనా బీ, దావూద్ సోదరి హసీనా పార్కర్ ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేశారు. చివరకు ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేస్తూ, ముంబయిలోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసలు తమకు సంబంధం లేని గదుల కోసం కస్కర్ కుటుంబంతో ప్రభుత్వం పోరాడుతుండగానే, మరోవైపు ఈ భవనానికి అసలైన యజమాని అయిన 'హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్' శిథిలావస్థలో ఉన్న ఈ కట్టడాన్ని రూ. 1.10 కోట్లకు 'సైఫీ బుర్హానీ అప్‌లిఫ్ట్‌మెంట్ ట్రస్ట్' కు విక్రయించేందుకు నవంబర్ 2015లో ఛారిటీ కమిషనర్ నుంచి అనుమతి పొందినట్లు బాంబే హైకోర్టు పత్రాలు చెబుతున్నాయి.ఈ విక్రయంతో భవన చరిత్రలో ఒక అధ్యాయం ముగిసినప్పటికీ, ఇదిదృష్టిని ఆకర్షించింది. నగరపాలక సంస్థ ఈ కట్టడాన్ని అత్యంత శిథిలావస్థలో ఉన్న, ప్రమాదకరమైన భవనంగా వర్గీకరించింది. దీనిని కూల్చివేయడానికి హైకోర్టు ఆగస్టు2020లో అనుమతి మంజూరు చేసింది.ఆ తర్వాతి కొన్నేళ్లలో,అధికారులు పై అంతస్తులను ఖాళీ చేయించి, దావూద్ ఇబ్రహీం ఒకప్పుడు నివసించి, కార్యకలాపాలు సాగించిన మొదటి, రెండో అంతస్తులలోని ప్రధాన నివాస భాగాలను కూల్చివేశారు.మిగిలిన 10 మొదటి అంతస్తు గదులతో పాటు గ్రౌండ్ ఫ్లోర్ స్థలాన్ని కూడా త్వరలోనే కూల్చివేయనున్నట్లు నవంబర్ 16న BMC నోటీసు జారీ చేసే వరకు గ్రౌండ్ ఫ్లోర్ అలాగే ఉంది. రోడ్డు విస్తరణ కోసం, ప్రమాదకర కట్టడాన్ని తొలగించడానికి ఈ కూల్చివేత అవసరమైందిఅయితే, స్థానికులు దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ, పేర్కొన్నట్లు గ్రౌండ్ ఫ్లోర్ కేవలం 'ప్రార్థనా మందిరం'మాత్రమే కాదని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ తన నోటీసులో ఆ స్థలాన్ని 'ప్రార్థనా మందిరం'గా పేర్కొంటూ, ప్రార్థనలు చేసుకునేవారు ప్రత్యామ్నాయ స్థలానికి వెళ్లాలని ఆదేశించిందిఅది ఒక మసీదు అని, వక్ఫ్ బోర్డుకు దానం చేసిన దాత ఆస్తి అని, అసలు మొదటి నుంచి దీనిని కి చట్టబద్ధంగా విక్రయించే హక్కు లేదని స్థానికులు, దుకాణదారులు, మహారాష్ట్ర వక్ఫ్ బోర్డు వాదిస్తున్నాయి. ఈ భవనం వక్ఫ్ ఆస్తి కాదని గతంలో వక్ఫ్ ట్రైబ్యునల్ ప్రకటించినప్పటికీ, ఈ విక్రయంపై అభ్యంతరాలు సుప్రీంకోర్టు వరకు వెళ్లాయి.పునరాభివృద్ధి చేసిన క్లస్టర్‌లో తమకు శాశ్వత స్థలం పొందే హక్కు ఉందని పేర్కొంటూ అద్దెదారులు, గ్రౌండ్ ఫ్లోర్ నిర్వాహకులు తమ నిరంతర స్వాధీనతను సాక్ష్యంగా చూపుతున్నారు. ఇక, స్థానికులకు మద్దతుగా నిలిచిన ఎంఐఎం నేత వారిస్ పఠాన్ ఈ కూల్చివేత చర్యను చట్టవిరుద్ధమని అభివర్ణించారు. ''సుప్రీంకోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఈ నోటీసు జారీ చేయడం చట్టవిరుద్ధం. ఇది 140 ఏళ్ల నాటి మసీదు. అది మసీదు అని గుర్తించినంత మాత్రాన బుల్డోజర్ తీసుకొచ్చి కూల్చేయలేరు. మా న్యాయపరమైన వాదనలు వినిపించడానికి మేము కేవలం 15 రోజుల గడువు మాత్రమే కోరుతున్నాం.. ఇలా ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తాం'' అని పఠాన్ అన్నారు.ప్రార్థనా స్థలాన్ని కూల్చివేయడానికి , ట్రస్ట్ కుట్ర పన్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే అమీన్ పటేల్ ఆరోపించారు. ట్రస్ట్ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను స్థానికులు వ్యతిరేకించడం లేదని, అయితే వక్ఫ్ ట్రైబ్యునల్ ముందు వివాదం పెండింగ్‌లో ఉన్నందున, ఇరుపక్షాల వాదనలు వినకుండా ఏకపక్ష చర్యలు తీసుకోవడం పూర్తిగా తప్పని పటేల్ తెలిపారు.

కొండగట్టు శ్రీ అంజనేయస్వామి చందనోత్సవాల సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

- ఈ నెల 20 నుంచి డిసెంబర్ 29 వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు...
- బందోబస్తు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా ఎస్పీ....



కొండగట్టు శ్రీ అంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న చందనోత్సవాల సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 29వ తేదీ వరకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చందనోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కొండగట్టుకు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత: ఆలయ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులు తమ విలువైన వస్తువులు, వ్యక్తిగత సామగ్రి విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి: ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తెలిపారు. సమన్వయంతో విధులు నిర్వహించాలి: బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు

రికార్డు స్థాయిలో పడిపోతున్న బంగారం ధరలు



(ముంబై, సాక్షర): దేశీయంగా, అంతర్జాతీయంగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు వరుసగా ఆరో సెషన్‌లోనూ రేట్లు భారీగా పడిపోతున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ప్రస్తుతం ఏకంగా 3800 డాలర్ల మార్కు దిగువకు చేరింది. అంటే గతేడాది సెప్టెంబరులో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఈ స్థాయిలో కొనసాగింది. అక్కడి నుంచి భారీగా పెరిగి ఈ ఏడాది జనవరి చివర్లో ఏకంగా ఔన్సుకు 5600 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. అంటే గరిష్ట స్థాయిల నుంచి పసిడి ధర 30 శాతానికిపైగా పడిపోయింది. సిల్వర్ రేటు చూస్తే మరీ ఎక్కువగా పడిపోయింది. అదే జనవరిలో ఔన్సుకు 121 డాలర్ల స్థాయిలో గరిష్ఠాల్ని తాకగా ఇప్పుడు అది 46 డాలర్లకు చేరింది. ఇది 60 శాతానికిపైగా పతనాన్ని చూయిస్తుంది.ఇక తాజాగా దేశీయంగా బంగారం, వెండి ధరలు భారీ స్థాయిలో పతనం అవుతున్నాయి. రోజు రోజుకు వేలల్లో తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో గ్రాము బంగారం కొనాలంటేనే కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు సామాన్యుడు సైతం కొనుగోలు చేసే విధంగా ధరలు అమాంతంగా దిగి వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. నిన్న ఒక్క రోజే దాదాపు 3 వేల రూపాయల వరకు దిగి వచ్చింది. వెండిపై 5 వేల రూపాయల వరకు తగ్గింది.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,340 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,290 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,250 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,22,140 వద్ద కొనసాగుతోంది. నిన్న ఒక్క రోజే దాదాపు 3 వేల రూపాయల వరకు దిగి వచ్చింది. వెండిపై 5 వేల రూపాయల వరకు తగ్గింది.

మొదటి పేజీ తరువాయి

ఒక్క రాత్రిలో 4,250 మంది కోటీశ్వరులు.. ఆంత్రోపిక్ ఐపీవోతో కాసుల వర్షం!

7,745)గా నిర్ణయించింది. సంస్థలోని మొత్తం 5,300 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. దాదాపు 80 శాతం మంది, అంటే సుమారు 4,250 మంది ఉద్యోగుల వద్ద ఉన్న స్టాక్ ఆప్షన్ల విలువ ఈ ఐపీఓతో కనీసం 1 మిలియన్ డాలర్లు (రూ.9.3 కోట్లు) దాటింది. వీరిలో దాదాపు 1,200 మందికి పైగా ఉద్యోగుల సంపద 10 మిలియన్ డాలర్లు (రూ.93 కోట్లు) దాటింది. తొలినాళ్లలో చేరిన 50 మంది ఉద్యోగుల ఈక్విటీ విలువ 100 మిలియన్ డాలర్ల (సుమారు రూ.930 కోట్లు) మార్కును అధిగమించింది. సంస్థ ఏడుగురు సహ వ్యవస్థాపకులు తమ వాటాల నుంచి 3.38 మిలియన్ల చొప్పున షేర్లను విక్రయించారు. దీంతో ఒక్కొక్కరి ఖాతాలోకి దాదాపు రూ.2,600 కోట్లు (280 మిలియన్ డాలర్లు) చొప్పున చేరాయి. ఏడుగురు వ్యవస్థాపకులకు కలిపి మొత్తం రూ.18,300 కోట్లకు (1.96 బిలియన్ డాలర్లు) పైగా సమకూరింది. మరోవైపు కంపెనీ మొత్తం 980 మిలియన్ షేర్లను విక్రయించి ఏకంగా రూ.7.6 లక్షల కోట్లు (81.3 బిలియన్ డాలర్లు) సమీకరించింది. గతంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ నమోదు చేసిన రూ.7.02 లక్షల కోట్ల (75 బిలియన్ డాలర్లు) ఐపీవో రికార్డును ఆంత్రోపిక్ తుడిచిపెట్టేసింది. ఈ మెగా ఇష్యూతో ఆంత్రోపిక్ మొత్తం మార్కెట్ విలువ ఊహకందని రీతిలో రూ.140 లక్షల కోట్లకు (1.5 ట్రిలియన్ డాలర్లు) చేరుకుంది. ఓపెన్ ఏఐ నుంచి బయటకు వచ్చిన పరిశోధకులు కేవలం ఆరేళ్ల క్రితం స్థాపించిన ఒక స్టార్టప్, ఇంత భారీ స్థాయిలో ఉద్యోగులను కుబేరులుగా తీర్చిదిద్దడం టెక్ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టిన గూగుల్, అమెజాన్ వాటాల విలువ కూడా ఒక్కొక్కటి రూ.9.3 లక్షల కోట్లకు పైగా పెరిగింది.

ఇందిరాగాంధీకి ఘన నివాళులు

(సిరిసిల్ల, సాక్షర): సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గాంధీ చౌక్ వద్ద మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ లో విదేశీయుడి వ్యాఖ్య

- సీపీకి ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యానారాయణ పిర్యాదు

(నిజామాబాద్, సాక్షర): హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో విదేశీ రాజకీయ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాలపై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయన అభ్యంతరం వ్యక్తం చేసారు. విదేశీ ప్రతినిధి వీసా, ఇమ్మిగ్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు కి వినతిపత్రం అందజేసారు. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనే విదేశీ ప్రతినిధులు భారత ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాటి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయం నుంచి విద్యాసాగర్‌తో తనకు ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "వరంగల్ కేంద్రంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యాసాగర్ మరణంతో తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయింది" అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వరంగల్ వేదికగా సాగిన పోరాటాల్లో, ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించడంలో ఆయన పోషించిన పాత్ర ఎనలేనిదని గుర్తుచేశారు. అచ్చా విద్యాసాగర్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి, పార్టీకి విద్యాసాగర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన మరణం పార్టీకి, ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యమ కాలం నుంచి నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నేత విద్యాసాగర్ మృతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

అందుబాటులోకి రానున్న యాదాద్రి ఐదో ప్లాంట్

(నల్గొండ,సాక్షర): తెలంగాణ విద్యుత్ రంగానికి మరింత బలం చేకూరనుంది. నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ఐదో యూనిట్ డిసెంబర్‌లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. దీంతో ప్లాంట్‌లోని మొత్తం ఐదు యూనిట్ల ద్వారా 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యం నెరవేరనుంది. తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కీలక దశకు చేరుకుంది. ఈ ప్లాంట్‌లో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే నాలుగు యూనిట్లు వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించి రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను అక్టోబర్ 20వ తేదీన గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ప్రస్తుతం అవసరమైన సన్నాహాలు కొనసాగుతుండగా.. డిసెంబర్‌లో ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఐదో యూనిట్ అందుబాటులోకి వస్తే యాదాద్రి ప్లాంట్ పూర్తి స్థాయిలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి మార్గం సుగమం అవుతుంది. రానున్న రబీ సీజన్‌లో విద్యుత్ డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ ప్లాంట్ కీలకంగా మారనుంది. యాదాద్రి ప్లాంట్‌లో బాయిలర్, టర్బైన్, జనరేటర్, యాష్ హ్యాండ్లింగ్, నీటి సరఫరా వంటి ప్రధాన వ్యవస్థలు సంతృప్తికరంగా పనిచేస్తున్నాయని టీజీ జెన్‌కో అధికారులు వెల్లడించారు. అయితే బొగ్గు సరఫరా చేసే కోల్ హ్యాండ్లింగ్ వ్యవస్థలో కొన్ని సాంకేతిక సమస్యలు గుర్తించారు. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందం యాదాద్రి ప్లాంట్‌ను సందర్శించింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్.. బీహెచ్ఈఎల్ అధికారులు కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించిన అనంతరం బొగ్గు సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చర్యల్లో భాగంగా 4 బొగ్గు ఫీడింగ్ లైన్లను పునరుద్ధరించారు. ఒక్కో లైన్ గంటకు సగటున 800 టన్నుల బొగ్గును సరఫరా చేయగలదు. దీంతో మొత్తం బొగ్గు నిర్వహణ సామర్థ్యం గంటకు 3,200 టన్నులకు చేరింది. బొగ్గు సరఫరాలో అంతరాయాలు తగ్గి ప్లాంట్ పనితీరు మెరుగుపడిందని అధికారులు తెలిపారు.విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. సింగరేణి సంస్థకు చెందిన ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి రోజుకు మూడు నుంచి నాలుగు బొగ్గు రేకులను యాదాద్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు నైనీ నుంచి 4.26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును ప్లాంట్‌కు తీసుకొచ్చారు. అదేవిధంగా మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్), సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) నుంచి మరో 4.6 లక్షల టన్నుల బొగ్గు కొనుగోలుకు ఒప్పందాలు కుదిరాయి. విండో-2 వేలం విధానం ద్వారా ఈ బొగ్గును సేకరించేందుకు ఈనెల 4వ తేదీన ఇంధన సరఫరా ఒప్పందాలు పూర్తయ్యాయి. బొగ్గు రవాణా కూడా ప్రారంభమైంది.మరోవైపు.. కేంద్ర విద్యుత్, బొగ్గు మంత్రిత్వ శాఖలతో తెలంగాణ ప్రభుత్వం, టీజీ జెన్‌కో అధికారులు జరిపిన సంప్రదింపులు సానుకూల ఫలితాలిచ్చాయి. యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూనిట్లకు ఎంసీఎల్, ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఈసీఎల్) నుంచి ఏడాదికి 7.71 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు సరఫరా చేసేందుకు స్టాండింగ్ లింకేజ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు బొగ్గు లభ్యత, నాణ్యతకు సంబంధించిన సమస్యలను తగ్గించడంతోపాటు ప్లాంట్ కార్యకలాపాలకు స్థిరత్వాన్ని కల్పించనున్నాయి.యాదాద్రి ప్లాంట్ పనితీరు మెరుగుపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలోనూ కీలక పురోగతి నమోదైంది. ఈనెల 11వ తేదీన తెలంగాణలో తొలిసారిగా 6,088 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వాటా 2,754 మెగావాట్లుగా ఉంది. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి చరిత్రలో ఇది కీలక మైలురాయిగా అధికారులు అభివర్ణిస్తున్నారు. యాదాద్రి ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం ప్రారంభిస్తే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుంది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు గ్రిడ్‌కు అవసరమైన విద్యుత్‌ను అందించడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది.బొగ్గు నిర్వహణ వ్యవస్థను నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా చేసేందుకు టీజీ జెన్‌కో దశలవారీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మొదటి కోల్ ఫీడింగ్ లైన్‌ను నిలిపివేసి సమగ్ర మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ సమయంలో మిగిలిన 3 లైన్లు యథావిధిగా పనిచేస్తాయి. తద్వారా బొగ్గు సరఫరా పూర్తిగా నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మరమ్మతుల సమయంలోనూ యాదాద్రి ప్లాంట్‌లోని 4 యూనిట్ల ద్వారా 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ సమన్వయంతో ఉత్పత్తిని 1,800 మెగావాట్లకు నియంత్రించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఈ పనులను బీహెచ్ఈఎల్, టీజీ జెన్‌కో సంయుక్తంగా పీఎంపీఎల్, బీటీఎల్, ఎల్ అండ్ టీ సంస్థల సహకారంతో చేపట్టనున్నాయి. కన్వేయర్ బెల్టులు, వైబ్రేటింగ్ గ్రిజ్లీ ఫీడర్లు, క్రషర్లు, బెల్ట్ ఫీడర్లు, స్టాకర్లు, రీక్లెయిమర్లు తదితర పరికరాలకు మరమ్మతులు చేయనున్నారు. అవసరమైన విడిభాగాలను ఇప్పటికే సిద్ధం చేశారు. మొదటి లైన్ పునరుద్ధరణ పూర్తయ్యాక గంటకు 2,500 టన్నుల బొగ్గు నిర్వహణ సామర్థ్యాన్ని బీహెచ్ఈఎల్ నిరూపించాల్సి ఉంటుంది. అనంతరం మిగిలిన లైన్లను కూడా ఇదే తరహాలో దశలవారీగా పునరుద్ధరించనున్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణం కరోనా మహమ్మారి, అటవీ అనుమతులు, రైల్వే భూములకు సంబంధించిన సమస్యలు, పర్యావరణ అనుమతులపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన ఆదేశాల కారణంగా ఆలస్యమైంది. అనంతరం పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనాలు, ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియలను మళ్లీ పూర్తి చేసి 2024 ఫిబ్రవరిలో నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం 4 యూనిట్లు వాణిజ్య ఉత్పత్తి చేస్తుండగా.. ఐదో యూనిట్ కూడా డిసెంబర్‌లో అందుబాటులోకి రానుంది.బొగ్గు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, దీర్ఘకాలిక ఇంధన ఒప్పందాలు, సాంకేతిక సమస్యల పరిష్కారం ద్వారా రానున్న రబీ సీజన్‌లో మొత్తం 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సాధించాలని టీజీ జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే తెలంగాణ విద్యుత్ రంగానికి గణనీయమైన బలం చేకూరనుంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో స్వీయ ఉత్పత్తి వాటా పెరగడంతోపాటు వ్యవసాయ, పారిశ్రామిక, గృహ విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు యాదాద్రి ప్లాంట్ కీలకంగా మారనుంది.

మొదటి పేజీ తరువాయి రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు

. సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు, రేవంత్ ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నడు. భూముల అమ్మకంపై ఉన్న శ్రద్ధ పాలనపై లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. గతంలో ప్రభుత్వాలు భూములు అమ్మితే నిరర్ధక ఆస్తులు, ప్రజలకు ఉపయోగపడని భూములును అమ్మేవి. కానీ రేవంత్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. కూకట్ పల్లి ట్రక్ పార్కింగ్ భూమి అనేది ప్రభుత్వ భూమి కాదు. ట్రక్ పార్కింగ్ భూమి. ప్రభుత్వ రికార్డుల్లోనూ అదే ఉంది.ఒక ప్రత్యేకమైన అసవరం కోసం ఆనాడు భూమి సేకరించడం జరిగింది. పబ్లిక్ పర్పస్ కోసం, ట్రక్ పార్కింగ్ కోసం అని ఆర్డర్ ఉంది.ఇప్పుడు దాన్ని పక్కనబెట్టి అమ్మేస్తాం అంటున్నారు. ల్యాండ్ అక్విజేషన్ యాక్ట్ ప్రకారం, తిరిగి రైతులకు ఇవ్వాలి తప్ప ఇష్టం ఉన్నట్లు వినియోగించడం కుదరదని అన్నారు. 26 వేల ఎకరాల భూమి ఇప్పటికే అమ్మిండు, 20 వేల ఎకరాల భూమిని బాంబే స్టాక్ ఎక్సేంజీలో కుదువ పెట్టి బ్రోకర్కు 500 కోట్ల లంచం ఇచ్చి 20 వేల కోట్లు అప్పు తెచ్చిండు. హెచ్ఎండీఏలో 800 ఎకరాల భూముల విషయంలో అదే బ్రోకర్ కు 250 కోట్లు లంచం ఇచ్చి 10వేల కోట్లు అప్పు తెచ్చిండు.చరిత్రలో ఎన్నడూ లేనిది బ్రోకర్లకు 500 కోట్ల లంచం అధికారికంగా ఇచ్చి భూములు అమ్ముతున్నడు.మియాపూర్ లో 400, మామిడిపల్లిలో 400 ఎకరాలు అమ్ముతా అంటున్నడు.అంటే 50 వేల కోట్ల భూములను ఈ సంవత్సరం అమ్మాలని టార్గెట్ పెట్టుకున్నడు.కమీషన్ల కోసం కాంట్రాక్టుల కోసం అమ్ముతున్నడు తప్ప ప్రజల కోసం కాదు. గ్యారెంటీల అమలు మరిచిపోయి, భూములను గ్యారెంటీగా అమ్ముతున్నడు.కాప్రాలో 400 గజాలు, అమీన్ పూర్ లో 300 గజాలు, బాచుపల్లిలో 490 గజాలు.. ఇలా గజాలను కూడా వదిలిపెట్టడం లేదని అన్నారు. నేడు ఎల్నినో కరువుకు నీళ్ల కరవు వస్తే, రేవంత్ పిచ్చి తుగ్లక్ చర్య వల్ల భూముల కొరత వచ్చే ప్రమాదం ఉంది. తిక్కలోడు తిరునాళ్లకు పోతే ఎక్కడానికి దిగడానికే సరిపోయింది అన్నట్లుంది రేవంత్ పాలన. ఫిక్ పోలీసు స్టేషన్ భూమి, నర్సరీ, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు, ఆర్టీఏ కార్యాలయం అక్కడే ఉంది. వాటన్నింటిని అమ్మేస్తావా. రేవంత్ గతంలో మాట్లాడిన మాటలు వింటే ఊసరవెల్లి కూడా ఉరి వేసుకుంటుంది. క్షణమే కూకట్ పల్లి వద్ద ట్రక్ పార్కు భూమి వేలాన్ని రద్దు చేయాలని అఖిలపక్షం పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ వేలాన్ని రద్దు చేయకుంటే 22, 23 తేదీల్లో జరిగే నిరాహార దీక్షలో బీఆర్ఎస్ ప్రత్యక్షంగా పాల్గొంటుంది. 25వ తేదీ హెచ్ ఎం డీఏ ముట్టడిలో బీఆర్ఎస్ పాల్గొంటుంది. ట్రక్ పార్క్ అనేది వేలాది మంది ప్రజలకు బతుకుదెరువు. వేలాది మంది జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉంది. పదేళ్ల ముందు బీఆర్ఎస్ ఈ భూములను కాపాడింది, నేడు మళ్లీ బీఆర్ఎస్ పోరు బాట పట్టింది. కార్మికుల కోరిక మేరకు మేం పూర్తి మద్దతు అందిస్తున్నాం. రాహుల్ గాంధీ గారు ప్రభుత్వ రంగం సంస్థలను, ప్రభుత్వ భూములను అమ్మొద్దు అని చెబుతుంటే రేవంత్ అదే పనిగా భూములు అమ్ముతున్నడు. రాహుల్ మాటకు విలువలేదా కాంగ్రెస్ పార్టీ ఆలోచించుకోవాలి. హైకమాండ్ చొరవ చూపి రేవంత్ కు బుద్ధి చెప్పాలి. లేకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుంది. ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. సీపీఐ, సీపీఎం సహా అన్ని వామపక్షాలు కలుపుకొని బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో బీసీ సంఘాల భేటీ

- డిసెంబర్ 14న ఢిల్లీ బీసీ జనభేరి సభకు హాజరు కావాలని ఆహ్వానించిన బీసీ సంఘాల నేతలు

(హైదరాబాద్, సాక్షర): టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో బీసీ సంఘాల నేతలు భేటీ అయ్యారు. డిసెంబర్ 14న ఢిల్లీ బీసీ జనభేరి సభకు హాజరు కావాలని ఆహ్వానించారు. మహేష్ కుమార్ ను కలిసిన అనంతరం మీడియాతో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనగణనలో ఓబీసీ కాలం చేర్చకుండా బిజెపి బీసీలను మోసం చేస్తుంది. బీసీ కులాల లెక్కలు లేకపోతే దేశంలో బీసీలు గత 80 ఏళ్లుగా హక్కులు కోల్పోతున్నారు . ఓబీసీ కాలం చేర్చి బీసీ కులగలనన చేపట్టకపోతే బిజెపికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం. ఓబీసీ కులగణన కు బిజెపి పార్టీ తప్ప దేశంలో ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపారు. రాహుల్ గాంధీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో కూడా తీర్మానం చేశారు. డిసెంబర్ 14న రామలీల మైదానంలో జరిగే బీసీ జనభేరి సభ ద్వారా బీసీల తడాఖాను కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామని అన్నారు.

దేశ అభ్యున్నతికి, ఐక్యత, సమగ్రత పరిరక్షణకు విశేష కృషి చేసిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

- ఇందిరా గాంధీకి సీఎం రేవంత్ నివాళులు

(హైదరాబాద్, సాక్షర): భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయురాలికి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభ్యున్నతికి, ఐక్యత, సమగ్రత పరిరక్షణకు విశేష కృషి చేసిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ గారిని స్మరించుకున్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జరుపుకుంటున్న జాతీయ సమైక్యతా దినోత్సవం దేశ పౌరులకు గొప్ప సందేశాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటే అన్న ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశ బలమని, సమానత్వం, సోదరభావం, పరస్పర గౌరవం, జాతీయ సమగ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పేర్కొన్నారు. దేశ ఐక్యతను కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం, సమైక్య భారత నిర్మాణానికి కృషి చేయడం ప్రతి పౌరుడి బాధ్యతని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ ఆశయాలను స్మరించుకుంటూ... ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి మనమంతా పునరంకితం కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

నగరంలో ఇంకుడు గుంతల పోటీ

- రూ. 10 లక్షల బహుమతులు ప్రకటించిన ఆలివ్ మిఠాయి
- పోటీల పోస్టర్‌ను విడుదల చేసిన హైడ్రా కమిషనర్



(హైదరాబాద్,సాక్షర): నగరంలో ఇంకుడుగుంతల పోటీని ఆలివ్ మిఠాయి నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న ఆలివ్ మిఠాయి సంస్థ.. వర్షపు నీటిని ఆదా చేద్దాం! ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను కాపాడుకుందాం! అనే నినాదంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆలివ్ మిఠాయి - ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమం పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు బుధవారం హైడ్రా కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్షాకాలం వరదలు తగ్గాలన్నా.. వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారించాలన్నా ఇంకుడు గుంతల ఆవశ్యకత ఎంతో ఉందని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అన్నారు. వర్షం నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపిస్తే భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకున్నా.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటే నీటి ఇబ్బందులనుంచి చాలా వరకు బయట పడే అవకాశం ఉందన్నారు. రూ. 10 లక్షల బహుమతులు.. ఇంకుడు గుంతను తవ్వి.. ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో @oliveforsociety పేజీకి COLLAB POST చేసి, ఫాలో చేయాలని ఆలివ్ మిఠాయి సంస్థ యజమాని శ్రీ దొర రాజుగారు సూచించారు. మాకు వచ్చిన వీడియోల్లో అత్యధిక వ్యూస్ సాధించిన వీడియోలకు రూ. 10 లక్షల బహుమతులు అందజేస్తామన్నారు. Save Water! Save Earth! మరియు Tree Guard - working for green world సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాయన్నారు. మొదటి బహుతికి రూ. 5 లక్షలు, రెండో బహుతికి రూ. 3 లక్షలు, మూడో బహుమతికి రూ. 2 లక్షలు అందజేస్తున్నామన్నారు. వర్షపు నీటిని ఒడిచి పట్టేలా నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్న హైడ్రాకు శ్రీ దొర రాజు ధన్యవాదాలు తెలిపారు. నగర చెరువుల రూపురేఖలను మారుస్తున్న హైడ్రా కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు. బహుమతులను కూడా హైడ్రా కమిషనర్ చేతుల మీదుగా అందజేస్తామని ప్రకటించారు.

భద్రాచలం ఛాంబర్ ఎన్నికలు న్యాయబద్ధంగా జరపాలి

- ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు
- రిజిస్టర్డ్ కమిటీలో అందరికీ హక్కులుంటాయి
- నిబంధనలు పాటించాల్సిందే
- వ్యాపార వర్గాలు ఆలోచించాలి
- బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్

భద్రాచలం, సాక్షర : భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు న్యాయబద్ధంగా జరపాలని, ఏకపక్ష నిర్ణయాలు సబబు కాదని, వ్యాపార వర్గాలు కలిసి ఉండాలని బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన భద్రాచలం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల నిర్వహణలో గత పదేళ్లుగా సందిగ్ధత నెలకొనడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇటీవల ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు పూనుకున్నప్పటి నుండి జరుగుతున్న పరిణామాలు ఒక వర్గానికి కొమ్ముకాస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా ఉంటున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నామినేషన్ ప్రక్రియ జరిగి, స్క్రూటినీ ముగిసి, గుర్తులు కేటాయించే సమయంలో కొందరిని ఎన్నికల పోటీ నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ఇన్నేళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నో సంస్థల ఎన్నికలు చూసామని, ఇటువంటి చిత్రమైన నిర్ణయాలు ఎన్నడూ.ఎక్కడ లేవన్నారు. రిజిస్టర్ కమిటీలో అందరికీ హక్కులు ఉంటాయని ఇది గమనించాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలోనే కొంత అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రిజిస్టర్ బాడీ ఎన్నికలు నిర్వహించాలంటే..రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలని, అటువంటిదేమీ చేయకపోవడం ఎన్నికల కమిటీకి అవగాహన రాహిత్యమేనని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల నిబంధనలను అడుగడుగున తుంగలో తొక్కారని, తమవారిని అందలం ఎక్కించేందుకే కుట్రలు జరిగాయని వెల్లడించారు. వ్యాపార వర్గాలు విజ్ఞతతో ఆలోచించాలని, ఇటువంటి కుయుక్తులను తిప్పి కొట్టాలని, అందరూ కలిసిమెలిసి ఉండాలని రావులపల్లి రాంప్రసాద్ ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,సాక్షర:హైదరాబాద్ హైటెక్స్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సును ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో కలిసి ప్రారంభించారు.ఈ సదస్సులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి విషయాల్లో రాజకీయాలకు తావు లేకుండా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి మిగిలిన సమయం దేశాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే అనేక సందర్భాల్లో అందించామని గుర్తుచేస్తూ వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం సైతం స్పష్టమైన విధానాలతో ముందుకు వెళుతోంది. స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ తనవంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. కేంద్రం కూడా తనవంతుగా రాష్ట్రానికి సహకారం అందించాలి. అందుకోసం తెలంగాణను మూడు జోన్లుగా విభజన చేసి లక్ష్యాలను నిర్దేశించాం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని సర్వీస్ సెక్టార్‌గా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.



రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నాం.

ఆయా రంగాలు అభివృద్ధి సాధించడానికి రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకు పటిష్టమైన రోడ్ నెట్‌వర్క్ ఉండాలి. ప్రధానంగా నగరాలు, గ్రామాలతో పాటు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తూ రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతాయి. తద్వారా వ్యాపార, వాణిజ్య రంగాలు వృద్ధి సాధిస్తాయి. మౌలిక సదుపాయాల కల్పనలో రోడ్లు మాత్రమే కాకుండా హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో కూడా తెలంగాణ ఎన్నో కీలకమైన చర్యలు చేపట్టింది. హెల్త్ కేర్ ప్రాధాన్యత దృష్ట్యా పురాతన ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని అత్యంత అధునాతన వసతులతో నిర్మిస్తున్నాం. అలాగే రాష్ట్రంలోని టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తంగా 8 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రులను నిర్మిస్తున్నాం అని ముఖ్యమంత్రి వివరించారు.

మానుకోట మార్నింగ్ వాక్ లో పట్టభద్రులతో ఆత్మీయ పలకరింపు



(మహబూబాబాద్, సాక్షర): పట్టణంలోని జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మాజీ ఎంపీ మాలోతు కవిత ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాక్‌కు వచ్చిన పట్టభద్రులు, నిరుద్యోగ యువత, స్థానిక ప్రజలను ఆత్మీయంగా కలుసుకొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నాను. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , మలోత్ కవిత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువకుడు, విద్యావంతుడు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు అండగా నిలవాలని కోరడం ఎంతో సంతోషాన్నిచ్చింది. కాగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైంది. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భరోసా, ఉద్యోగులకు న్యాయం, రైతులకు గిట్టుబాటు ధరలు అందని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బిందు , మాజీ మున్సిపల్ చైర్మన్ రామ్ మోహన్ రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భరత్ రెడ్డి , జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి చారిత్రక భేటీ

అనంతరం జరిగిన ఎపెక్ విందులో ముగ్గురు నేతలు కలిసి గ్రూప్ ఫొటోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్, పుతిన్ కరచాలనం చేసుకున్నారు. 2025లో అలస్కాలో జరిగిన చర్చల తర్వాత వీరిద్దరూ ముఖాముఖి కలుసుకోవడం ఇదే మొదటిసారి. చాలా కాలం తర్వాత పుతిన్ మళ్లీ ఎపెక్ నేతల గ్రూప్ ఫొటోలో కనిపించడం గమనార్హం. అణ్వాయుధాల తగ్గింపుపై చర్చలు ప్రారంభించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని, దీని ద్వారా తక్షణ ఒప్పందాలు కుదురుతాయని ఆశించడం లేదని అమెరికా అధికారులు స్పష్టం చేశారు. ఈ భేటీలో ఇరాన్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఉక్రెయిన్ అంశంపై చర్చించే అవకాశం లేదని తెలుస్తోంది. చైనాతో వాణిజ్యపరంగా కొత్త సుంకాలపై కాకుండా, ఇప్పటికే ఉన్న ఒప్పందాల అమలుపైనే చర్చలు జరగనున్నాయి. ఈ భేటీకి ముందు ఎపెక్ సదస్సులో జిన్‌పింగ్, పుతిన్ తమ ప్రసంగాలతో తమ వైఖరులను స్పష్టం చేశారు. స్వేచ్ఛా వాణిజ్యానికి చైనా కట్టుబడి ఉందని జిన్‌పింగ్ చెప్పగా, పశ్చిమ దేశాలు విధిస్తున్న ఆంక్షలు బెదిరించలేవని పుతిన్ ఘాటుగా విమర్శించారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ త్రైపాక్షిక సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.


మొదటి పేజీ తరువాయి అక్వాన్ తుపానుపై ఐఎండీ తాజా హెచ్చరిక..!

మీ, పూరీకి 550 కి.మీ దూరంలో ఉన్నట్లు బులెటిన్ పేర్కొంది.తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 20 మధ్యాహ్నం నాటికి ఉత్తరాంధ్ర–యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య నర్సాపూర్–పూరి పరిధిలో, గోపాల్‌పూర్‌కు తూర్పువైపున తీరం దాటే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 90–100 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.ఉత్తర కోస్తాంధ్రలో నవంబర్ 19, 20 తేదీల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.తీరప్రాంత ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది.

మొదటి పేజీ తరువాయి టీ కాంగ్రెస్ లో అంతర్మథనం !

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు నిధులు కోరినప్పుడు రేవంత్ రెడ్డి స్పందనపై ఆయన ప్రశ్నలు సంధించారు. "మీరు ఏ విధమైన ముఖ్యమంత్రి?" అని రాజగోపాల్ రెడ్డి అడిగారు."మీరు అదృష్టవశాత్తు ముఖ్యమంత్రి అయ్యారు. కనీసం మరో రెండు సంవత్సరాలు ప్రజల కోసం బాగుంటారు" అని ఆయన అన్నారు. రాజగోపాల్ రెడ్డి, రేవంత్ రెడ్డి ప్రతిపక్షాన్ని నాశనం చేయాలని హెచ్చరించినట్లు ఆరోపణలు చేసిన తర్వాత స్పందించారు.ఒక సీనియర్ పార్టీ ఎమ్మెల్యేపై బెదిరింపులు వేయడం సరైనదా? అని ఆయన ప్రశ్నించారు. "తెలంగాణ కేవలం కొడంగల్ మరియు మధిర మాత్రమే కాదు" అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.మునుగోడె మరియు ఇతర వెనుకబడిన ప్రాంతాలకు న్యాయమైన అభివృద్ధి నిధులు అందించాలి అని ఆయన ప్రస్తావించారు. మునుగోడె అభివృద్ధి కోసం నిధులు ఆపితే, అది "మరో కురుక్షేత్రం" అవుతుందని ఆయన హెచ్చరించారు. నిధుల కొరత కారణంగా రోడ్లు మరియు సాగునీటి ప్రాజెక్టులు నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు.చౌటుప్పల్‌లో 100 బెడ్ ఆసుపత్రి నిర్మాణంలో ఆలస్యాన్ని ప్రశ్నించారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. తన విమర్శలు కేబినెట్‌లో చేర్చకపోవడం వల్ల అని ఆరోపణలను ఆయన తిరస్కరించారు.మంత్రి పదవులపై తనకు ఆసక్తి లేదని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కింద అవినీతిలో పాల్గొన్న కాంట్రాక్టర్లు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో కొనసాగుతున్నారని ఆయన ఆరోపించారు. జడ్చర్ల ఎమ్మెల్యే జే అనిరుధ్ రెడ్డి కాంట్రాక్టర్ల నుండి 10-20% కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ప్రభుత్వ అధికారులపై ఆరోపణలు చేశారు.రూ. 5 లక్షల సిమెంట్ రోడ్డు ప్రాజెక్టును ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. అధికారిక కొలతల పుస్తకాల్లో (ఎంబీ) కొలతలు నమోదు చేయడానికి అధికారులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రూ. 15,000 కరుపు తీసుకున్న తర్వాత ఒక అధికారిక వ్యక్తి ఆస్తి సంబంధిత పనిని పూర్తి చేశాడని ఆయన ఆరోపించారు.తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త శక్తి-పంచాయితీ డిమాండ్ ఉత్పన్నమైంది. వెనుకబడిన తరగతుల నాయకుల ఒక విభాగం అదనపు ఉప ముఖ్యమంత్రి పదవిని కోరుతున్నారు. ఈ డిమాండ్ ప్రస్తుతం ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఉంది.సీనియర్ మంత్రులు మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు ఈ డిమాండ్‌లో పాల్గొంటున్నారు. వెనుకబడిన తరగతుల నాయకుడిని ఉప ముఖ్యమంత్రిగా నియమించడానికి పార్టీ ఉన్నత కమాండుకు ఆమోదం కోరుతున్నారు. కేబినెట్ విస్తరణకు ప్రేరణ ఉంది.మూడు మంత్రిత్వ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని సమాచారం. డిసెంబర్‌లో కేబినెట్ పునఃసంఘటన మరియు విస్తరణపై చర్చలు జరుగుతున్నాయి.లో ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచుతామని ప్రజలకు మాట ఇచ్చి, మూడేళ్లు గడుస్తున్నా దాన్ని అమలు చేయకపోతే గ్రామాల్లో ప్రజలకు ఏం సమాధానం చెబుతామని ఆయన నిలదీశారు. ఇచ్చిన మాటపై నిలబడటం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేర్పిన కాంగ్రెస్ సంప్రదాయమని గుర్తు చేస్తూ, ప్రస్తుత నాయకత్వానికి చురకలంటించారు. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో, ప్రభుత్వ పనుల్లో మొండిచేయి ఎదురైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారం అనుభవించిన వారు, ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లే మళ్లీ ముందు వరుసలో ఉండి లబ్ధి పొందుతున్నారన్న ఆయన ఆరోపణ పార్టీ శ్రేణుల్లోని అసంతృప్తికి అద్దం పడుతోంది.తన విమర్శలను కేవలం మంత్రి పదవి దక్కలేదన్న అసహనంగా చిత్రీకరించే ప్రయత్నాలను రాజగోపాల్ రెడ్డి తిప్పికొట్టారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, అందరూ అధిష్ఠానానికి జిందాబాద్ కొడుతూ భజన చేస్తే తప్పులను సరిదిద్దేదెవరని ప్రశ్నించారు. పార్టీ మారుతారన్న ఊహాగానాలను కొట్టిపారేస్తూనే, ముఖ్యమంత్రి మిగిలిన రెండేళ్ల కాలంలోనైనా అన్ని నియోజకవర్గాలను సమానంగా చూస్తూ పెద్దన్న పాత్ర పోషించాలని సూచించారు.రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో ఇదే తరహాలో నియోజకవర్గ అభివృద్ధి, ఆత్మగౌరవం నినాదంతో ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లిన చరిత్ర ఉంది. ఇప్పుడు ఈసారి గురి తప్పదు, మరో కురుక్షేత్రం తప్పదు అంటూ ఆయన చేసిన హెచ్చరికలు అధిష్ఠానానికి స్పష్టమైన అల్టిమేటమ్‌లా కనిపిస్తున్నాయి. ఒకవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే, మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేనే ఇంత తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికర పరిణామమే.!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు



- 18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అధికారులు, సిబ్బందికి ఐడీఓసీలో శిక్షణ


(రాజన్న సిరిసిల్ల,సాక్షర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు ఇతర అధికారులకు సిబ్బందికి జిల్లా సమీకృత కార్యాలయం ఆడిటోరియంలో బుధవారం ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని వెల్లడించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్జీదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. బీమా చేయించేవారు నామిని వారి వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ నామినీలు కూడా ఉండవచ్చని వెల్లడించారు. దరఖాస్తు ఫారంలో సంతకం చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాల వద్ద టెంట్లు, కుర్చీలు, బీమా వివరాల ప్లెక్సీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదు కోసం కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, సిబ్బంది హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శిబిరాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మొదటి పేజీ తరువాయి దారుణంగా పడిపోతున్న నీటి నిల్వలు

సింగూర్ కుంటలో కేవలం 7% నీరు మాత్రమే మిగిలి ఉంది, మంజీరాలో 17% మాత్రమే ఉంది. ఒస్మాన్ సాగర్ 54% నీటి నిల్వను కలిగి ఉంది, నాగార్జున సాగర్ 57% నీటి నిల్వను కలిగి ఉంది. ఢిల్లీ నగరానికి 1,000 మిలియన్ లీటర్ల నీటి కొరత ఉంది, అయితే ఈ సీజన్‌లో 14% ఎక్కువ వర్షపాతం అందించడం కొంత ఉపశమనం కలిగించింది.ఢిల్లీ జల్ బోర్డు అత్యవసర నీటి సరఫరా కోసం పునఃచక్రీకరణ మరియు బోర్‌వెల్స్ ద్వారా ఏర్పాట్లు చేసుకుంది. ముంబైలో పరిస్థితి మెరుగ్గా ఉంది, అక్కడ ప్రధాన కుంటలలో 80% పైగా నీటి నిల్వ ఉంది. బెంగళూరులో కావేరి బేసిన్ కుంటలు సుమారు 50% నిండినవి.బెంగళూరు నగరంలో నీటిని ఏ ప్రాంతానికి అయినా పంపించడానికి ప్రత్యామ్నాయ పంపింగ్ స్టేషన్లు ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి మరియు మెదక్-మల్కాజిగిరి ప్రాంతాలు ఈ సంవత్సరం 240 మిమీ తక్కువ వర్షపాతం నమోదుచేసాయి, ఇది 33% వర్షపాతం లోటును సూచిస్తుంది. జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధన సంస్థ నిపుణులు ఫిబ్రవరిలో నీటి మట్టం తగ్గడం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఐటీ కారిడార్‌లో సుమారు 350,000 వినియోగదారులు పూర్తిగా మంజీరా నీటిపై ఆధారపడి ఉన్నారు. ఈ వినియోగదారులకు వచ్చే నెలలో నీటి కొరత సమస్యలు ఎదురవుతాయని అంచనా వేయబడుతోంది. హైదరాబాద్‌లో నీటి సంక్షోభం ఏప్రిల్ వరకు కొనసాగవచ్చు.ఎల్ నినో ప్రభావం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. కుంటలు అత్యంత తక్కువ స్థాయికి చేరుకునే ప్రమాదంలో ఉన్నాయి. హైదరాబాద్‌లో మొత్తం నీటి సరఫరా రోజువారీ అవసరాలను తీర్చడానికి తగినంత లేదు.నగరానికి సరఫరా చేస్తున్న నీటి మొత్తం అవసరమైన మొత్తానికి కంటే తక్కువగా ఉంది. వర్షపాతం తగ్గడం హైదరాబాద్‌లో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఈ నీటి సంక్షోభం నివాసితులు మరియు అధికారులకు పెరుగుతున్న ఆందోళనగా మారుతోంది.నిపుణులు మరియు స్థానిక అధికారులు ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నీటి మట్టం తగ్గే అవకాశం దీర్ఘకాలిక ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఈ సంక్షోభం నీటి సరఫరాపై ఆధారపడి ఉన్న వివిధ రంగాలను ప్రభావితం చేయవచ్చు.ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. వచ్చే నెలలు హైదరాబాద్‌లో నీటి నిర్వహణకు కీలకమైనవి. కుంటల పరిస్థితులు వాతావరణ నమూనాల నేరుగా ఫలితంగా ఉన్నాయి.ప్రత్యేక నీటి వనరులపై ఆధారపడటం వలనే ఈ నగరం మరింత ప్రమాదంలో ఉంది. వచ్చే నెలల్లో వర్షపాతం అంచనాలు అనిశ్చితంగా ఉన్నాయి. ఈ పరిస్థితి సుస్థిరమైన నీటి నిర్వహణ పద్ధతుల అవసరాన్ని ప్రదర్శిస్తోంది.స్థానిక సమాజాలను నీటిని ఆదా చేయాలని సూచిస్తున్నారు. ఈ సంక్షోభం నీటి వనరుల కోసం పెరిగిన పోటీని కలిగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరతలను నివారించడానికి దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం.నగరంలోని చెరువులు, నాలాలు, వాటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, కాలుష్యం నుంచి రక్షించే బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (PPP) విధానంలో నిర్వహిస్తున్న ఎస్టీపీల్లో నీటి నాణ్యతను పర్యవేక్షించాలి. క్యూర్ చట్టం-2026లోని సెక్షన్లు 241, 242 ప్రకారం తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి. అవసరమైన సందర్భాల్లో ఇతర ప్రభుత్వ శాఖలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో సహకరించాలి. నీటి వనరుల పరిరక్షణతోపాటు భూగర్భ జలాల రీఛార్జ్‌కు ఉపయోగపడే ప్రాంతాలను కాపాడటంపై ప్రత్యేక దృష్టి సారించనుంది.రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 100 ఎంఎల్‌డీ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రాలను పర్యవేక్షించనుంది. శుద్ధి చేసిన నీరు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలించాలి. ప్రమాణాలు పాటించని సంస్థలపై చట్టపరమైన, నియంత్రణపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు భూగర్భజల శాఖ వాల్టా చట్టం-2002 ప్రకారం అక్రమ బోర్ల తవ్వకాలు, భూగర్భ జలాల అనధికార వినియోగాన్ని నియంత్రించనుంది. క్యూర్ పరిధిలోని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలను నిరంతరం విశ్లేషిస్తూ కొత్త బోర్ల తవ్వకాలకు అనుమతుల విషయంలో పర్యవేక్షణ చేపట్టనుంది.హైదరాబాద్ పరిధిలోని మూడు నగరపాలక సంస్థలు, హెచ్ఎండీఏ తమ పరిధిలో 100 ఎంఎల్‌డీల కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ప్రైవేట్ ఎస్టీపీల నిర్వహణను పర్యవేక్షించనున్నాయి. కొత్త భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఎస్టీపీల ఏర్పాటు నిబంధనలను అమలు చేయాలి. శుద్ధి చేసిన మురుగునీటిని తాగునీరు అవసరం లేని ఇతర పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసేలా చూడాలి. సమాచార, పౌర సంబంధాల శాఖ జలమండలితో కలిసి నీటి సంరక్షణ, నీటి భద్రత, గ్రీన్ ట్యాంకర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. ప్రచార కార్యక్రమాల ద్వారా నీటి పొదుపు ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మొత్తంగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, ప్రత్యామ్నాయ నీటి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడమే ప్రభుత్వ కార్యాచరణ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది

సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోంది

• కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్



(ఆదిలాబాద్ రూరల్, సాక్షర) కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అధికారానికే పరిమితం కాకుండా ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి, సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు.భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో పర్యటించి చేయూత పింఛన్ లబ్ధిదారులను కలుసుకున్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నేపథ్యంలో ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులైన లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మంది అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఒక్కరికి కూడా మంజూరు చేయలేదని నిర్లక్ష్యం పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 4.5 లక్షల పింఛన్లను మంజూరు చేయడం ద్వారా ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ముందడుగు వేసిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అధికారానికే పరిమితం కాకుండా ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి, సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవ కొనసాగించడమేనని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ డిసిసి సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇంచార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దేవిదాస్ చారి, రూరల్ మండల అధ్యక్షుడు వెంకట యాదవ్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ అక్తర్ అలీ, సేవాదళ్ ఆఫ్సర్, పట్టణ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల బాధ్యులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలే మనకు స్ఫూర్తి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఇందిరమ్మ ఆశయాలే మనకు స్ఫూర్తి అని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ విశ్వబోధి గాయక్వాడ్ అన్నారు. గురువారం భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, భారతరత్న స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఘన నివాళులు అర్పించినట్లు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ విశ్వబోధి గాయక్వాడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఇందిరా గాంధీ భారతదేశానికి అందించిన అమూల్యమైన సేవలను, దేశ అభివృద్ధికి చేసిన కృషిని, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

గూడెంలో నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్ టెక్నికల్ ఛార్జ్

• విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం ...వినియోగదారులకు మెరుగైన సేవలు



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను గురువారం డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)వి. మోహన్ రావు డైరెక్టర్ (ఆపరేషన్స్) టి .మధుసూధన్ టెక్నికల్‌గా ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ 132 కేవీ కౌటాల సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ బెజ్జూర్ ఫీడర్‌కు అనుసంధానిస్తూ నిర్మించిన ఈ నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా గూడెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్టం కానుందని పేర్కొన్నారు. స్థానికంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా సామర్థ్యం మెరుగుపడటంతో పాటు, లోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు ఈ సబ్‌స్టేషన్ దోహదపడనుందని వివరించారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థలో మౌలిక సదుపాయాల విస్తరణ, నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ వినియోగం పెరిగినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు .కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్స్ కుమురం భీం ఆసిఫాబాద్ జూడే ఉత్తమ్ , డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



(తలమడుగు, సాక్షర) మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి పరిహారం ఇవ్వాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. వర్షాభావంతో అల్లాడుతున్న తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 23వ తేదీన సుంకిడి గ్రామంలో రైతు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసీ) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైతు నాయకులు ప్రకటించారు. పంటలు ఎండిపోయి రైతులు విలవిల ... ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో మండలంలో సోయా, పత్తి, కంది పంటలు పూర్తిగా ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినా అధికారులు ఇప్పటివరకు తలమడుగు మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “ఇది ఒక్క సుంకిడి గ్రామ సమస్య కాదు, మొత్తం తలమడుగు మండల సమస్య. మన హక్కు కోసం మనమే పోరాడాలని, 23న జరిగే నిరసనలో మండలంలోని ప్రతి గ్రామం నుంచి వందలాది మంది రైతులు పాల్గొని విజయవంతం చేయాలని రైతు జెఏసీ నాయకుడు పద్మాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోట్టి కిరణ్ కుమార్, తిరుపతి శ్రీనివాస్, అభిరామ్ రెడ్డి, సర్పంచులు చంటి, లాస్మ, మరెడ్డి, నిమ్మల గజానన్న, నానేశ్వర్, మహేందర్ యాదవ్, ప్రతాప్ కిరణ్, రైతు సంఘాల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

దేశ చరిత్రలో ఇందిరాగాంధీది చెరగని ముద్ర

• కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) భారతదేశ రాజకీయ చరిత్రలో మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీది చెరగని ముద్ర అని, దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు అన్నారు.భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను గురువారం నిర్మల్‌లోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ధైర్యసాహసాలకు, దృఢమైన నాయకత్వానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం లక్ష్యంగా ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట.... గరీబీ హటావో' నినాదంతో పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఇందిరాగాంధీ 1969లో 14 ప్రధాన బ్యాంకులను జాతీయీకరించి సామాన్య ప్రజలకు, రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశారని గుర్తుచేశారు. భూ సంస్కరణలు, బలహీన వర్గాల అభ్యున్నతి, 20 సూత్రాల కార్యక్రమం ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేశారని వివరించారు.\వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని కొనియాడారు అలాగే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి 1991లో బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఇందిరా గాంధీ ప్రదర్శించిన నాయకత్వ పటిష్ట ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు.ఇందిరాగాంధీ జీవితం, ప్రజాసేవ, దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదయకమన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని స్వర్గీయ ఇందిరాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

ఫ్యాన్సీ నంబర్ల ఎంపిక గడువు 60 రోజుల నుంచి 30 రోజులకు కుదింపు

• వాహన యజమానులు గడువులోగా రిజర్వేషన్, బిడ్డింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్ల కేటాయింపు ప్రక్రియలో కీలక మార్పులు చేపట్టింది. ఫ్యాన్సీ నంబర్లను పొందాలనుకునే వాహన యజమానులకు ఇప్పటివరకు ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించింది.ఈ నూతన నిబంధనలు నవంబర్ 19, 2026 నుంచి అమల్లోకి వస్తాయని రవాణా శాఖ ప్రకటించింది.కొత్త వాహనాలకు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ అయిన తేదీ నుంచి 30 రోజులలోపు సంబంధిత రిజర్వేషన్,బిడ్డింగ్ (వేలం),చెల్లింపు ప్రక్రియలను పూర్తి చేసి తమకు నచ్చిన ప్రత్యేక రిజిస్ట్రేషన్ నంబర్‌ను పొందాలని సూచించింది.గడువులోగా ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపులో జాప్యాన్ని నివారించవచ్చని రవాణా శాఖ పేర్కొంది. వాహన యజమానులు ఈ నూతన నిబంధనలను గమనించి నిర్ణీత సమయంలోగా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

బ్యాంకులు సేవా దృక్పథంతో పనిచేయాలి: అదనపు కలెక్టర్ రాజా గౌడ్



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): బ్యాంకులు లాభ అపేక్షతోనే కాకుండా రైతులకు ప్రజలకు సేవా దృక్పథంతో పనిచేయ వలసిన సామాజిక బాధ్యత బాధ్యత ఉందని అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అన్నారు. గురువారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 104 వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ సీఈఓ నాగభూషణం వందే, బ్యాంక్ జనరల్ మేనేజర్ అనుపమ ఆదరణలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగస్తులు బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులకు, ఖాతాదారులకు శ్రేయోభిలాషులకు ది నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు యొక్క 104 వ వ్యవస్థాపక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈరోజు జరిపిన ఉత్సవాలలో భాగంగా బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన అదనపు కలెక్టర్ రాజా గౌడ్ తో పాటు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, బ్యాంక్ సీఈఓ నాగభూషణం వందే, బ్యాంక్ జనరల్ మేనేజర్ అనుపమ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ సీఈఓ నాగభూషణం స్వయంగా రక్తదానం చేసి సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచారు. అదేవిధంగా బ్యాంక్ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల సిబ్బంది ఉత్సాహంగా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, బ్యాంక్ సీఈఓ, జనరల్ మేనేజర్లు, ఇతర అధికారులు మరియు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, అత్యవసర సమయాల్లో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.బ్యాంక్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సామాజిక బాధ్యతతో పాటు మానవతా విలువలను చాటుకున్నారు.

ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం

• డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్



(ఆదిలాబాద్, సాక్షర) దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను నేతలు కొనియాడారు.భారతదేశపు తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను నేతలు కొనియాడుతూ, నినాదాలు చేస్తూ ఆమెను స్మరించుకున్నారు.అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును సందర్శించి రోగులకు, చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపుల నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, కౌన్సిలర్ అన్నపూర్ణ, మావల మండల అధ్యక్షుడు సురేష్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు బెజ్జంకి అనిల్, మాజీ కౌన్సిలర్ గౌళి సంజయ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

- అర్హులందరికీ చేయూత పెన్షన్లు
- కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ మంత్రి సీతక్క

హైదరాబాద్: మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.63 లక్షల మందికి చేయూత పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తామని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకే ప్రభుత్వం చేయూత పెన్షన్లు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యత మేరకు అర్హులైన పేద కుటుంబాలను ఆదుకుంటున్నామని తెలిపారు. మహిళలు మహిళా సంఘాల్లో చేరి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఒక్కో మహిళా సంఘానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళలకు స్ఫూర్తి అని, ఆమె పేరుతోనే ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళల పేరుతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని, హైటెక్ సిటీ సమీపంలో రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళా శక్తి మార్కెట్‌ను మహిళా సంఘాలకు కేటాయించామని వెల్లడించారు. ఈ నెల 26 నుంచి చేయూత పెన్షన్ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు చిలకపచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు అందించడమే లక్ష్యమని ప్రకటించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ మహిళలకు షాపులు ఏర్పాటు చేయించి, రుణాలు అందించి వ్యాపారాల్లో ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలి



(జన్నారం, సాక్షర): ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షుడు ఉప్పు తిరుపతి కోరారు. జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామ గల్ఫ్ కార్మికుని కుటుంబానికి రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 72,675 రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు సమితి అధ్యక్షుడు ఉప్పు తిరుపతి తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని గల్ఫ్ కార్మికుడు పురంశెట్టి నగేష్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడానికి ఈ డబ్బులు అందజేయడం జరిగిందని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను అన్ని రకాలుగా ఆదుకుంటామని ప్రకటనలు చేస్తున్నాయని, ఈ ఒక్క హామీ అమలు కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కుటుంబ సభ్యులకు డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఉప్పు సురేష్, ఉప్పు రాజారెడ్డి, ఒడ్డేటి రమేష్, ఉప్పు రామన్న, సేపూరి సతీష్, కుంట భూమేష్, పులిశెట్టి భూమరేడ్డి, పులిశెట్టి భగత్, కుంట రమేష్, పురంశెట్టి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



- అజ్మీరా రేఖా శ్యాంనాయక్

(జన్నారం, సాక్షర) సమాజంలోని మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందాలని ఖానాపూర్ మాజీ శాసనసభ్యురాలు అజ్మీరా రేఖా శ్యాంనాయక్ అన్నారు. సమాజంలోని మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందాలని ఖానాపూర్ మాజీ శాసనసభ్యురాలు అజ్మీరా రేఖా శ్యాంనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అనుష సిల్క్ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని మహిళలకు అందివచ్చిన ఆర్థిక ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కుట్టు మిషన్ శిక్షణ మహిళలకు ఉపాధి కలగడంతో పాటు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు సరికొండ లక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కోసం ఇందిరమ్మ చేసిన కృషి ఆదర్శనీయం

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు ఘనంగా ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) పేదల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం ఇందిరమ్మ చేసిన కృషి ఆదర్శనీయమని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు అన్నారు. భారత మాజీ ప్రధానమంత్రి ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను నిర్మల్‌లోని కే శ్రీహరి రావు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ చరిత్రలో ఇందిరాగాంధీ ఒక గొప్ప నాయకురాలిగా ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం లక్ష్యంగా ఆమె ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు.పేదల అభ్యున్నతే లక్ష్యంగా చారిత్రాత్మక నిర్ణయాలు గరీబీ హటావో నినాదంతో పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారని, 1969లో 14 ప్రధాన బ్యాంకులను జాతీయీకరించి గ్రామీణ ప్రాంతాలు, రైతులు, పేదలు, సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు చేరువయ్యేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని శ్రీహరిరావు వివరించారు. భూ సంస్కరణలు, బలహీన వర్గాల అభ్యున్నతికి చర్యలు, 20 సూత్రాల కార్యక్రమం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కృషి చేశారని అన్నారు.రైతుల సంక్షేమం, దేశ ఆహార భద్రతకు బాటలు వేస్తూ హరిత విప్లవానికి ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి అధిక దిగుబడినిచ్చే వంగడాలు, సాగునీరు, ఎరువులు, వ్యవసాయ రుణాల విస్తరణకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహం అందించారని గుర్తు చేశారు. దీంతో దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందడుగు వేసిందని పేర్కొన్నారు.దేశ ఐక్యత, అంతర్జాతీయ స్థాయిలో భారత గౌరవం కోసం 1971లో బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఆమె చూపిన నాయకత్వం, దేశ రక్షణ విషయంలో తీసుకున్న ధైర్యవంతమైన నిర్ణయాలు భారతదేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో పెంచాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం, అణుశక్తి, అంతరిక్ష పరిశోధనలకు ఆమె అందించిన ప్రోత్సాహం దేశ ప్రగతికి బలమైన పునాది వేసిందని పేర్కొన్నారు.ఇందిరాగాంధీ జీవితం, ఆమె చేసిన త్యాగాలు, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని శ్రీహరిరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలైన లౌకికవాదం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఇందిరాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ వ్యవసాయమే ముద్దు!



మనం తింటున్నది ఆహారమా? అనారోగ్యానికి ఆహ్వానమా? భూమిని కాపాడితేనే మనిషి బతుకుతాడు.. రైతును ఆదరిస్తేనే ఆరోగ్య భారత్ సాధ్యం! ఒకప్పుడు వ్యవసాయం అంటే ప్రకృతితో ముడిపడిన జీవన విధానం. పశువుల పేడ, పంట వ్యర్థాలు, చెట్ల ఆకులే భూమికి సహజమైన పోషకాలు. పొలాల్లో వానపాములు, పక్షులు, సీతాకోకచిలుకలు కనిపించేవి. కానీ నేడు అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరుగుతోంది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో నేల ఆరోగ్యం, నీటి నాణ్యత, జీవవైవిధ్యంపై ప్రతికూల ప్రభావాలు కనిపిస్తున్నాయి. దిగుబడి పెరిగితేనే వ్యవసాయ అభివృద్ధి జరిగినట్టా? భూమి సారం తగ్గి, సాగు ఖర్చులు పెరిగి, రైతు అప్పుల పాలైతే ఆ అభివృద్ధికి అర్థమేమిటి? మొదట భూమి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశాం.. ఇప్పుడు మనిషి ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్నాం. రైతును నిందించొద్దు.. వ్యవస్థను ప్రశ్నించాలి! రైతు కావాలని రసాయనాలపై ఆధారపడటం లేదు. మార్కెట్ పోటీ, అధిక దిగుబడుల ఒత్తిడి, పెట్టుబడి ఖర్చులు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యల మధ్య సాగు చేస్తున్నాడు. అందుకే రసాయన వ్యవసాయాన్ని ఒక్కసారిగా వదిలేయాలని చెప్పడం పరిష్కారం కాదు. రైతుకు ప్రత్యామ్నాయాలు, శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం కల్పించాలి.రసాయన ఎరువులన్నీ విషపదార్థాలేనని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. అయితే నేల పరీక్షలు చేయకుండా అవసరానికి మించి ఎరువులు వాడటం, అనుమతిలేని పురుగుమందులు వినియోగించడం, పంట కోతకు ముందు నిర్దేశిత విరామ సమయాన్ని పాటించకపోవడం ప్రమాదకరం. సమతుల్య వినియోగమే ముఖ్యం. మన కంచంలోకి ఏమి వస్తోంది? మనం ప్రతిరోజూ తినే పండ్లు, కూరగాయలు, ధాన్యాలు ఎంత సురక్షితమైనవి? పంటలపై ఉపయోగించే కొన్ని పురుగుమందుల అవశేషాలు ఆహారంలో మిగిలే అవకాశం ఉంది. వాటి ప్రభావం వినియోగించిన రసాయనం, మోతాదు, కాలవ్యవధిపై ఆధారపడి ఉంటుంది. అందుకే ఆహార పదార్థాల్లో రసాయన అవశేషాలను పరీక్షించే ప్రయోగశాలలను విస్తరించాలి. నిబంధనలకు మించిన అవశేషాలున్న ఉత్పత్తులపై చర్యలు తీసుకోవాలి. మన పిల్లలకు అందించే ఆహారం సురక్షితమైనదా అనే ప్రశ్న ప్రతి కుటుంబం ఆలోచించాలి. భూమి ఆరోగ్యమే భావితరాలకు భరోసా! భూమి కేవలం మట్టి కాదు. అందులోని సూక్ష్మజీవులు, వానపాములు, సేంద్రియ పదార్థాలు కలిసి ఒక జీవ వ్యవస్థను నిర్మిస్తాయి. అధిక రసాయనాల వినియోగం, ఏకపంట సాగు, పంట వ్యర్థాలను తగులబెట్టడం వంటి చర్యలు నేల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. పశువుల పేడ, వర్మీకంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులు, పంటల మార్పిడి వంటి పద్ధతులను ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానంతో కలిపి ప్రోత్సహించాలి. నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచి, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచాలి. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు సేంద్రియ ఎరువులకు ప్రోత్సాహం: రసాయన ఎరువులతోపాటు జీవ ఎరువులు, కంపోస్ట్ తయారీ యూనిట్లకు సబ్సిడీలు కల్పించాలి. నేల పరీక్షలు: ప్రతి రైతుకు భూసార పరీక్షలు నిర్వహించి, అవసరమైన పోషకాలపై నిపుణుల సలహాలు అందించాలి.రైతులకు శిక్షణ: ప్రతి జిల్లాలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఆహార నాణ్యత పరీక్షలు: పండ్లు, కూరగాయలు, ధాన్యాల్లో పురుగుమందుల అవశేషాలను క్రమం తప్పకుండా పరీక్షించాలి. గిట్టుబాటు ధర: సేంద్రియ పంటలకు ప్రత్యేక మార్కెట్, ధృవీకరణ, తగిన ధర కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్, పీఎం ప్రణామ్ వంటి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థంగా అమలు చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలి. ఒక్కసారిగా కాదు.. దశలవారీగా మార్పు! వంద శాతం సేంద్రియ వ్యవసాయానికి ఒక్కరోజులో మారడం అన్ని ప్రాంతాల్లో సాధ్యం కాకపోవచ్చు. అందుకే ముందుగా రసాయనాల మితిమీరిన వినియోగాన్ని తగ్గించాలి. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి. జీవ ఎరువులు, పంటల మార్పిడి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను ప్రోత్సహించాలి. రైతుకు నష్టం కలగకుండా శాస్త్రీయ ఆధారాలతో మార్పు తీసుకురావాలి. ఆసుపత్రులు నిర్మించడం అభివృద్ధిలో భాగమే. కానీ ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా సురక్షిత ఆహారం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం అందించడం కూడా ప్రభుత్వాల బాధ్యత. ఆరోగ్య భారత్ అంటే చికిత్సలతోపాటు వ్యాధుల ముప్పును తగ్గించే జీవన విధానం కలిగిన భారత్. మన పిల్లలకు ఆస్తిగా ఇవ్వాల్సింది భూమా? అప్పులా? ఈరోజు మనం పిల్లల కోసం ఆస్తులు సంపాదిస్తున్నాం. కానీ వారు రేపు జీవించబోయే భూమి సారవంతంగా ఉందా? తాగబోయే నీరు స్వచ్ఛంగా ఉందా? తినబోయే ఆహారం సురక్షితంగా ఉందా? అని ఆలోచించాలి. రైతు బతికితేనే దేశం బతుకుతుంది. రైతుకు గిట్టుబాటు ధర, తక్కువ పెట్టుబడి ఖర్చులు, శాస్త్రీయ సలహాలు అందినప్పుడే వ్యవసాయంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, వినియోగదారులు సమష్టిగా బాధ్యత తీసుకోవాలి. భవనాలు మనకు నివాసం కల్పిస్తాయి.. భూమి మనకు జీవనాధారం అందిస్తుంది. మనం భూమిని కాపాడితే భూమి మనల్ని కాపాడుతుంది. రైతును గౌరవిస్తేనే ఆహారానికి విలువ ఉంటుంది. సురక్షిత ఆహారాన్ని అందిస్తేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమవుతుంది. రసాయనాల విచక్షణారహిత వినియోగానికి స్వస్తి పలుకుదాం! సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం! రైతును కాపాడుదాం.. భూమిని బతికిద్దాం.. భావితరాల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దాం! ఆరోగ్య భారత్.. సారవంతమైన భూమితోనే సాధ్యం!



వ్యాసకర్త: ఉక్కుల్ కర్ రాజేందర్ నాథ్ , సీనియర్ జర్నలిస్ట్, ఫో న్: 9440287170

కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి బాధిత కుటుంబాలకు పరామర్శ



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా సోన్ మండల కేంద్రంలో, సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.అదేవిధంగా నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్ కాలనీకి చెందిన కె. శ్రీనివాస్ (ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్) తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు గోపు గోపీ, కత్తి నరేందర్, చెనిగారపు నరేష్, ఎస్పీ రాజు, మాజీ కౌన్సిలర్లు తారక రఘు, ఎలుగు సుధాకర్, నాయకులు అయిండ్ల పోశెట్టి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



(ఆదిలాబాద్‌రూరల్, సాక్షర): అంకోలిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆదిలాబాద్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు బ్రాంచ్ మేనేజర్ ఎస్.ఎన్. శ్రీను బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ వినాయక్ మేనేజర్, అవివా లైఫ్ ఇన్సూరెన్స్ నిరంజన్ ఏరియా మేనేజర్, అవివా లైఫ్ ఇన్సూరెన్స్ రవి ఆఫీస్ సబార్డినేట్ పాల్గొన్నారు.అంకోలి ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మేత సుభాష్, కృష్ణవేణి దాసరి ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య సహాయకులు గుండం శ్రీదేవి, పవర్ ప్రేమసింగ్, ఆశా కార్యకర్తలు రావుల రాధా, ఆత్రం పుష్పలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఉచితంగా మహారాష్ట్ర బ్యాంక్ వారు ఫ్రీ అకౌంట్స్ అందించారు. అదే విధంగా జీవిత బీమా పాలసీల గురించి పీఎం జెజెబివై, పీఎంఎస్‌బివై, ఏపీవై, ప్రభుత్వ సామాజిక బాధ్యత, డిపాజిట్ పథకం, పొదుపు ఖాతాలు, ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ అకౌంట్ కు సంబంధించిన ఉచిత వ్యక్తిగత బీమా సదుపాయం, గృహ రుణాలు, కారు రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయంపై రుణాలు తదితర కార్యక్రమాలపై మేనేజర్ గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఉచిత బ్యాంక్ అకౌంట్ తో పాటు వైద్య సదుపాయాన్ని గ్రామ ప్రజలకు అందించడం జరిగింది. కార్యక్రమంలో అంకోలి వైద్య సిబ్బంది, మహారాష్ట్ర బ్యాంక్ ఆదిలాబాద్ బ్రాంచ్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు యాపలగూడ సెక్టార్ ఏరియా సూపర్‌వైజర్ బొమ్మేత సుభాష్ తెలియజేశారు.

ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను స్మరించుకుందాం



(ఆదిలాబాద్, సాక్షర): దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను స్మరించుకుందామని కాంగ్రెస్ నేతలు అన్నారు. భారతదేశపు తొలి మహిళా ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరా గాంధీ చేసిన చిరస్మరణీయ సేవలను నేతలు కొనియాడుతూ, నినాదాలు చేస్తూ వారిని స్మరించుకున్నారు.అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును సందర్శించి రోగులకు, చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపుల నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, కౌన్సిలర్ అన్నపూర్ణ, మావల మండల అధ్యక్షుడు సురేష్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు బెజ్జంకి అనిల్, మాజీ కౌన్సిలర్ గౌళి సంజయ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్నిసద్వినియోగం చేసుకోవాలి

• పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లింగంపల్లి మహేష్ చెన్నూర్‌లో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



(చెన్నూర్, సాక్షర) భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి,భారతరత్న స్వర్గీయ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను చెన్నూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లింగంపల్లి మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ ఐక్యత, సమగ్రత పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకురాలు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' పేద, మధ్యతరగతి కుటుంబాలకు ₹5 లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మా శ్రీనివాస్, వైస్ చైర్మన్ నాయకపు వినయ్, నాయకులు అంబటి శంకర్, మంత్రి లక్ష్మీ, పెండ్యాల సాగర్, నజ్మా అమీర్, జయలక్ష్మి బ్రహ్మయ్య, స్వప్న రాజేష్, సాధనబోయిన కృష్ణ, సయ్యద్ సాహిర్, కుర్మా రాజమల్ల గౌడ్, తనుగుల సతీష్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు జంగపల్లి సంజయ్, ఎండీ బషీర్, గజ్జల అంకాగౌడ్, పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, తగరం కృష్ణ, బీమ్ మధు, చింతకింది ప్రశాంత్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు పెండ్యాల శ్రీకాంత్, పెద్దకొండ నరేష్, చెన్న వెంకటేష్, ఎండీ హాజీ, ఇబ్రాహీం షరీఫ్, తుంగపిండి అనిల్, ఎండీ జావీద్, రమేష్ రెడ్డి, కడవండి మహేష్, గాలి తిరుపతి, ఎండీ వసీం, ఎస్కే అతిఫ్, నెవురి శేఖర్, ఎండీ అఖిల్, తగరం నాగరాజు, పోగుల లచ్చన్న, మహబూబ్, లీలా, లక్ష్మీ, మెరుగు చైతన్య, మల్లక్క, సంతోష్, నేనెలా భీమన్న, తదితర నాయకులు, మహిళలు, యువకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే మా లక్ష్యం



(జన్నారం, సాక్షర): పోనకల్ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా మేము పనులు చేస్తున్నామని పోనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ బూమేష్ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మా పాలకవర్గం సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు.గ్రామ పంచాయతీ పరిధిలో ఇంతవరకు చేసిన అభివృద్ధి పనులతో పాటు చేయవలసిన పనులపై చర్చించామని గ్రామంలో సానిటేషన్, తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర పనులపై చర్చించామని ఆమె తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ అప్పాల జలపతి, కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్, వార్డు సభ్యులు రాథోడ్ సంతోష్, మోసిన్ శాఖాన్, మల్లయ్య, అంజన్న, ప్రమీల, రాజన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



(తానూర్, సాక్షర): మండల కేంద్రంలో నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు మంజూరు చేయాలని స్థానిక నాయకులు మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డిని కోరారు. మండల కేంద్రంలో నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, జగాలేని నీరు పెద్దలకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి స్లాటు మంజూరయ్యేలా చూడాలని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో నూతన పెన్షన్ మంజూరు కాని కొందరికి కూడా పెన్షన్ మంజూరు చేయాలని స్థానిక నాయకులు మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు డి. సుభాష్, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, సాయినాథ్, పండరి, మల్లేష్, గంగాధర్, ముత్యాల, ముదిరాజ్ కులస్తులు తదితరులు ఉన్నారు.

విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితానికి బలమైన పునాది

• ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితానికి బలమైన పునాది అని, విద్యార్థులకు సరైన సమయంలో ప్రోత్సాహం, సహకారం అందిస్తే వారు గొప్ప విజయాలు సాధించగలరని ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ పేర్కొన్నారు. గురువారం గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తోడ్పడుతూ, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ స్వయంగా ఆయా గ్రామాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తలేగావే, మాటేగాం, వలంపాడ, కుబీర్ మండలంలోని పర్డి (బి), మహాగావ్ గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. పర్డి (బి) గ్రామంలోని ఎల్‌బీఎం కాన్సెప్ట్ స్కూల్‌తో పాటు జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా పుస్తకాలను అందించారు.ఈ సందర్భంగా భోస్లే మోహన్‌రావు పాటిల్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితానికి బలమైన పునాది అని, విద్యార్థులకు సరైన సమయంలో ప్రోత్సాహం, సహకారం అందిస్తే వారు గొప్ప విజయాలు సాధించగలరని పేర్కొన్నారు.పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యాపరంగా అండగా నిలవడం, వారి చదువుకు అవసరమైన సహకారం అందించడం ప్రజా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ప్రజా ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని వెల్లడించారు.విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడమే కాకుండా, పదో తరగతి పరీక్షలకు మరింత మెరుగ్గా సిద్ధమయ్యేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా ప్రజా ట్రస్ట్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్మల్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

• మంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వినతి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు నిధుల కేటాయింపు ఎంతో అవసరమని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు.హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని గురువారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కలిసి నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) తో పాటు రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు నిధుల కేటాయింపు ఎంతో అవసరమని ఎమ్మెల్యే వివరించారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

కుటుంబ యజమానురాలికి నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలి

• రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



(బజార్ హత్నూర్, సాక్షర) ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నంబర్ 194 ప్రకారం ఆరు లక్షల రూపాయల పరిహారంతో పాటు ఆర్థిక భరోసా, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. కరువు తీవ్రత మూలంగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో 2026లో నేటికీ 27 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.నేడు బజార్ హత్నూర్ మండలంలోని వర్తమాన్నూర్ గ్రామానికి చెందిన పరస భీమ్ రావ్ అనే రైతు గత రెండు వారాల క్రితం మానసిక వేదనతో తను సాగు చేస్తున్న పత్తి పంట పూర్తిగా వాడి పోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డితో కలిసి కలిశారు. వ్యవసాయానికి చేసిన పంట పెట్టుబడి, దిగుబడులపై అధ్యయనం చేస్తూ, ఆర్థిక స్థితిగతులపై కుటుంబ సభ్యుల నుండి సమాచారం తీసుకున్నారు. వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి రాదనే బెంగతో, ఈ ఏడాదిలో కరువు తీవ్రత ఉండడం మూలంగా తను సాగు చేస్తున్న పత్తి పంట పండిస్తున్న క్రమంలో పంటకు అయిన ఖర్చులకు ఆశించినంత పంట దిగుబడి రాక, వారి కుటుంబ సభ్యుల ద్వారా సమాచారాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది.వాస్తవంగా గత సంవత్సరం అతి భారీ వర్షాల వలన పంట చేతికి రాక, ఈ ఏడాదిలో అత్యల్ప వర్షపాతం నమోదు కావడం మూలంగా పంట ఏపుగా పెరిగినా సరైన పంట దిగుబడి రాక, ప్రకృతి విపత్తుల ద్వారా అధిక, అత్యల్ప వర్షపాతాలు నమోదు కావడంతో తాము పండించిన పంట ఆశించినంత దిగుబడి రాక, ఈ ఏడాదిలో పంట ఎదుగుదల లేక పోవడంతో మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నంబర్ 194 ప్రకారం ఆరు లక్షల రూపాయల పరిహారంతో పాటు ఈ కుటుంబానికి ఆర్థిక భరోసా, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు.కుటుంబ యజమానురాలికి నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలి. వీరి పిల్లలకు ఉన్నతమైన ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలి.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ వారు, రెవెన్యూ సిబ్బంది కలిసి రైతు ఆత్మహత్యలు జరుగకుండా గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రతి రైతుకి ఆర్థిక భరోసా కల్పించే విధంగా చిరు ధాన్యాలపై, ఆకు కూరగాయలు, కోళ్ల పెంపకం, పాడి గేదెల, మేకల పెంపకమును ప్రోత్సహించే విధంగా, నెలసరి ఆదాయం 15,000 రూపాయలు ఉండే విధంగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలపడం జరిగింది. ఇందులో భాస్కర్ రెడ్డి, పుల్ సింగ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుకి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



(మంచిర్యాల, సాక్షర): వివాహ వేడుకకు హాజరుకావాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావును ఆహ్వానించారు.హైదరాబాద్‌లోని బేగంపేట ప్రకాష్ నగర్‌లో ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిడి రుక్మారెడ్డి కుమారుని వివాహ ఆహ్వాన పత్రికను టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావును ఆత్మీయంగా కలిసి వివాహ వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు.

గోదావరి పుష్కరాల పనులను సమన్వయంతో వేగవంతం చేయాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) గోదావరి నది పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.గురువారం బాసర ఆలయ ఈఓ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాల కోసం చేపట్టిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖాధిపతి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గోదావరి నదిలో ప్రస్తుత నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఫొటోల రూపంలో పంపించాలని ఆదేశించారు. పనులకు సంబంధించి అవసరమైన అనుమతులు, ప్రభుత్వపరమైన నిర్ణయాలు పెండింగ్‌లో ఉంటే వాటిని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఆలయ నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పుష్కరాల సందర్భంగా వచ్చే ప్రముఖుల వసతి కోసం చేపడుతున్న భవన నిర్మాణ పనులపైనా పలు సూచనలు చేశారు.అనంతరం బాసరలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలకు అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. పరిసరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్ ఈఈ అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో పిల్లలకు పండ్ల పంపిణీ



ఆదిలాబాద్, సాక్షర : భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకా నగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కావేటి జ్యోతి , కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి లింగంపల్లి నర్సిములు పాల్గొని అంగన్వాడీ చిన్నారులకు పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలనకు కృషి, హరిత విప్లవానికి ప్రోత్సాహం వంటి అనేక నిర్ణయాలతో దేశ అభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. మహిళలు సైతం దేశ అత్యున్నత పదవులను అధిరోహించి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించగలరని ప్రపంచానికి చాటిచెప్పిన నాయకురాలు ఇందిరా గాంధీ అని అన్నారు. ఆమె ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని చిన్నారులకు పండ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.

గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



(దస్తూరాబాద్ , సాక్షర) గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, గ్రామ పంచాయతీ భవనాలు గ్రామ పరిపాలనకు కేంద్రాలుగా నిలుస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం దస్తూరాబాద్ మండలం అకొండపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, గ్రామ పంచాయతీ భవనాలు గ్రామ పరిపాలనకు కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అలాగే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం గురించి వివరిస్తూ, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పులకు తావివ్వకుండా 'ఇందిరమ్మ బీమా' నమోదు

• ఎడిట్ ఆప్షన్ లేనందున అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాజర్షిషా



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం అమలుపై గురువారం బేలా మండల ఎంపిడిఓ కార్యాలయం నుండి జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ భీమా పథకం ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించిన తర్వాత 'ఎడిట్' (సవరణ) ఆప్షన్ ఉండదని, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఏమాత్రం తప్పులు జరగకుండా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. పొరపాట్లు జరిగితే భవిష్యత్తులో లబ్ధిదారులకు బీమా క్లెయిమ్ అందడంలో ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు.శిబిరాలు ప్రారంభించే ముందే లాగిన్లతో తప్పనిసరిగా టెస్ట్ రన్ నిర్వహించి, గ్రామ పంచాయతీలు, మండలాల పేర్లు సరిగ్గా కనిపిస్తున్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే తెలియజేయాలనీ, నెట్‌వర్క్ సమస్య ఉన్న గ్రామాల్లో కాకుండా, తొలుత నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న పంచాయతీల్లో శిబిరాలు ప్రారంభించి, సోమవారం నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పెద్ద పంచాయతీలు, పట్టణ వార్డుల్లో రద్దీని నివారించేందుకు రెండు, మూడు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల ప్రింట్ అవుట్లు, స్కానింగ్ అవసరం లేదని, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ లేదా మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేసి పీడీఎఫ్ రూపంలో భద్రపరుచుకోవచ్చని వివరించారు. అయితే ప్రతి శిబిరంలో 'క్యాంప్ లెవల్ రిజిస్టర్'ను పక్కాగా నిర్వహించి, ట్రాన్సాక్షన్ ఐడీ, ఎఫ్ఎస్సీ నంబర్, లబ్ధిదారు, నామినీ వివరాలతో పాటు లబ్ధిదారు, క్యాంప్ అధికారి, సూపర్‌వైజర్ సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. కుటుంబానికి ఆధారమైన 18 నుంచి 59 ఏళ్ల వయసు గల వ్యక్తిని అర్హుడిగా గుర్తించాలని, వారికి ఇప్పటికే రైతు బీమా లేదా ఇతర ప్రభుత్వ బీమా పథకాలు ఉన్నాయో లేదో పక్కాగా నిర్ధారించుకుని నమోదు చేయాలన్నారు. మీసేవ కేంద్రాలను సైతం వినియోగించుకోవచ్చని, ఈ సేవలకు లబ్ధిదారుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని తేల్చిచెప్పారు. అర్హులై ఉండి పెండింగ్ రేషన్ కార్డు కుటుంబాల దరఖాస్తులను పరిష్కరించి అందజేయాలని, కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. పీవీటీజీ ఆవాసాల్లో బీమా శిబిరాలతో పాటే ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాల జారీని అనుసంధానం చేయాలని సూచించారు. డేటా ఎంట్రీ కోసం శిక్షణ పొందిన ఆపరేటర్లతో పాటు డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని, ప్రభుత్వం పంపిన నమూనా బ్యానర్లు, పోస్టర్లను మాత్రమే ఎలాంటి మార్పులు చేయకుండా ప్రదర్శించాలని పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కౌంటర్, కాల్ సెంటర్ నంబర్లపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, ఎస్.రాజేశ్వర్, ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, బేలా మండల ప్రత్యేక అధికారి మనోహర్, ఎంపిడిఓ మహేష్ కుమార్, ఏంఆర్ఓ ప్రవీణ్ కుమార్ లతో పాటు అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఏంపిఓలు, మండల స్థాయి సూపర్ వైజర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండ

• జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



(ఆదిలాబాద్, సాక్షర) ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు బోథ్ మండలం కౌట గ్రామంలో బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్.బోథ్ మండలం కౌట గ్రామానికి చెందిన సింగడి శ్రావణిల్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య చికిత్స పొందుతున్న నేపథ్యంలో, చికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ను ఆశ్రయించారు. దీంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన డాక్టర్ నరేష్ జాదవ్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు. తాజాగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 2,00,000 రూపాయల చెక్కు మంజూరు కావడంతో ఈరోజు బోథ్ మండలం కౌట గ్రామంలోని శ్రావణిల్ రెడ్డి నివాసానికి వెళ్లి సింగడి శ్రావణిల్ రెడ్డి భార్య నిఖితకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని అన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.ప్రజలకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపుల సత్యనారాయణ, బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, బోథ్ ఆత్మ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పశుల చంటి, బోథ్ గ్రామ సర్పంచ్ కురుమే మహేందర్, సోనాల మండలాధ్యక్షుడు పోతన్న, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దౌలత్ రావు, కౌట గ్రామ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ రెడ్డి, రాజు రెడ్డి, సింగడి నర్సా రెడ్డి, చిలకండి రవి, నాయిది శ్రీనివాస్, గంగయ్య, లెనిన్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతోనే రైతులకు భరోసా: కలెక్టర్ రాజర్షిషా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గి, వాతావరణ మార్పులను తట్టుకుని మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం బేలా మండలం చాంద్‌పల్లి గ్రామంలో సీపీఎఫ్ సంస్థ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సూచనలు, సలహాలు అందజేశారు.ముందుగా సిపిఎఫ్ సహకారంతో దర్గాజీ అనే రైతు సాగు చేస్తున్న పంటలను, ఎరువు తయారీ, పంట నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వ్యవసాయ విధానాల గురించి అధికారులను, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యానవన పంటలతో పాటు పత్తిలోనూ జీవామృతం, నీమాస్త్రం వినియోగిస్తూ ప్రకృతి సాగు చేస్తున్న స్థానిక రైతులను అభినందించారు. జిల్లాలోని 30 క్లస్టర్లలో బయో రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఒక్కో కేంద్రానికి రూ.లక్ష విలువైన పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి సాగు చేసే రైతులకు, వరద బాధితులకు ఉద్యానవన శాఖ ద్వారా పనస, మునగ, వెదురు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 35 నుంచి 36 శాతం వర్షపాతం లోటు నమోదైన నేపథ్యంలో, పంట నష్టంపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారని వివరించారు. జిల్లాలోని 101 క్లస్టర్లలో సాగుతున్న ఈ ప్రక్రియకు రైతులు సహకరించి ఏఈఓల వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పత్తి తొలగించిన తర్వాత జొన్న, మొక్కజొన్నకు బదులుగా తక్కువ నీటితో త్వరగా పండే శనగ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యానవన పంటలను సాగు చేయాలని కోరారు. పంటల అనంతరం ఖాళీగా ఉన్న పొలాల్లో వీబీజీ రాంజీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పిస్తామని, దీనివల్ల ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి పంట కుంటలు, ఊటకుంటలు, పొలం బాటలు, ఇంకుడు గుంతలు, పశువుల తొట్టెలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించుకోవాలని సూచించారు. బేలా మండలంలో త్వరలోనే కస్టమ్ హైరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పత్తి ఏరివేత తర్వాత కట్టెలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, వాటిని కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలని రైతులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం రేపటి నుంచి ప్రారంభిస్తున్న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'లో 18 నుంచి 59 ఏళ్ల వయసు గల వారందరూ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాలకు రేషన్ కార్డు, ఆధార్, మొబైల్ నంబర్‌తో హాజరై వివరాలు నమోదు చేయిస్తే రూ.5 లక్షల బీమా రక్షణ లభిస్తుందని చెప్పారు.అనంతరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఏర్పాటు చేసిన స్టాల్ ను పరిశీలించి, ఫుడ్ సెక్యూరిటీ, కన్సర్వేషన్ ప్రాజెక్ట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తదుపరి రైతును కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, డీహెచ్ఎస్ఓ దిలీప్ కుమార్, ఇంచార్జి డిఏఓ శ్రీధర్, ఎంపీడీఓ మహేష్ కుమార్, ఎంఆర్ఓ ప్రవీణ్ కుమార్, ఎంఏఓ సాయి తేజ రెడ్డి, శాస్త్రవేత్తలు, సర్పంచ్ కోరంగే మంగళ, సీపీఎస్ సంస్థ డైరెక్టర్ గిరిజా, సంస్థ ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, రైతులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే ప్రజా ట్రస్ట్ ఆశయం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే ప్రజా ట్రస్ట్ ఆశయమని ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ అన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న యోగేష్‌ను ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.గురువారం చింతల్‌బోరి గ్రామంలో యోగేష్ నివాసానికి స్వయంగా వెళ్లిన భోస్లే మోహన్‌రావు పాటిల్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకుని, మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కష్ట సమయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, యోగేష్ కుటుంబానికి ప్రజా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మనోధైర్యాన్ని అందించడం ప్రజా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాసేవలో భాగంగా అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు.కష్టకాలంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి భరోసా కల్పించడం ద్వారా మానవతా విలువలను చాటుకుంటున్న ప్రజా ట్రస్ట్ సేవలను పలువురు అభినందిస్తున్నారు.

యువతి ప్రమాద ఘటనతోనైనా కళ్లు తెరవాలి

• హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) యువతి ప్రమాద ఘటనతోనైనా కళ్లు తెరవాలని, భవన నిర్మాణాల భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్ కోరారు.నిర్మల్‌లో ఆనంద్ షాపింగ్ మాల్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంపై నుంచి సంగీత అనే యువతి దూకి తీవ్రంగా గాయపడిన ఘటనపై హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో డీఆర్ఓ రాథోడ్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ భవన నిర్మాణాల్లో సేఫ్టీ నెట్స్, బారికేడ్లు, గ్రిల్స్ వంటి కనీస భద్రతా ఏర్పాట్లు చేయడం లేదని ఆరోపించారు. నిబంధనలు పాటించని భవన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే అనుమతులు రద్దు చేయాలని కోరారు. భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రక్షణ చర్యలు చేపట్టలేదని, అవసరమైన రక్షణ నెట్ అందుబాటులో లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మల్‌కు అత్యవసర రక్షణ పరికరాలు సమకూర్చాలని కోరారు.వినతిపత్రం ప్రతులను జిల్లా ఎస్పీ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, సీడీఎంఏ, అగ్నిమాపక శాఖ డైరెక్టర్, టౌన్ సీఐలకు అందజేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సయ్యద్ హైదర్ కోరారు.

వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

(దహేగాం, సాక్షర): విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలుకలుగుతుందని టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. మోహన్ రావు అన్నారు.తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపరిచేందుకు నిర్మించిన 33 కేవీ దహెగాం-కన్నెపల్లి ఇంటర్‌లింకింగ్ లైన్‌ను గురువారం సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. మోహన్ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్ విజయవంతంగా ఛార్జింగ్ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ సుమారు 18 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఈ లైన్ ద్వారా కాగజ్‌నగర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ దహెగాం ఫీడర్‌ను బెల్లంపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ కన్నెపల్లి ఫీడర్‌తో అనుసంధానం చేశామని చెప్పారు.ట్రాన్స్‌కో విభాగం చేపట్టే 132 కేవీ లైన్ నిర్వహణ పనులు, లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) సమయంలో కాగజ్‌నగర్, బెల్లంపల్లి డివిజన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా మార్గంగా ఈ ఇంటర్‌లింకింగ్ లైన్ ఉపయోగపడుతుందన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలుకలుగుతుందన్నారు. టీజీఎన్పీడీసీఎల్ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ నెట్‌వర్క్‌ను నిరంతరం బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ (ఆపరేషన్స్) ఆసిఫాబాద్ జాడే ఉత్తమ్, జీఎం ప్రభావతి, డీఈఈ (ఆపరేషన్స్) సిర్పూర్-కాగజ్‌నగర్, ఏడీఈ (ఆపరేషన్స్), దహెగాం ఏఈతో పాటు సంబంధిత సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలి

• జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చెరువుల పూడికతీత పనుల పరిశీలన



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ప్రభుత్వ పథకాల లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం కింద చేపడుతున్న చెరువుల పూడికతీత పనులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువుల్లో చేపడుతున్న పూడికతీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల నిర్వహణ తీరును సమీక్షించారు. ప్రభుత్వ పథకాల లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి చెరువుల పూడికతీత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాపట్ల, పాక్‌పట్ల సర్పంచ్ శ్రీలత, గాంధీనగర్ సర్పంచ్ ఆమని బసవరాజ్, గ్రామాల సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత క్రమంలో అనుమతులు మంజూరు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.ఐఆర్‌సీ 85వ వార్షిక సమావేశం సందర్భంగా హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిశారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు.ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత క్రమంలో అనుమతులు మంజూరు చేయాలని కోరారు.అలాగే ఆదిలాబాద్‌లో ఏర్పాటు కానున్న జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్, డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్లు, రక్షణ రంగ మౌలిక సదుపాయాలు, మెగా ఇండస్ట్రియల్ పార్క్‌కు మెరుగైన రవాణా అనుసంధానం కల్పించేందుకు రింగ్ రోడ్డు ఎంతో కీలకమని వివరించారు.రింగ్ రోడ్డు నిర్మాణం ద్వారా పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్ ఒక ప్రధాన అభివృద్ధి కేంద్రంగా ఎదుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్ర మంత్రికి వివరించారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత డాక్టర్ నరేష్ జాదవ్

• రోగులకు పండ్ల పంపిణీ



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాసేవకు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. భారతరత్న, భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దేశ ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆమె జయంతిని పురస్కరించుకుని పేదలకు, రోగులకు, చిన్నారులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆమె ఆశయాలను స్మరించుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.సమాజంలో పేదలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులకు మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తోడ్పడాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాసేవకు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్‌చార్జి గౌలి సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దేవిదాస్ చారి, రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అక్తర్ అలీ, సేవాదళ్ నాయకుడు ఆఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే పట్టణ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలి: డా. నరేష్ జాదవ్

• మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణకి నియామక పత్రం అందజేత



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇటీవల ఆదిలాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన అన్నపూర్ణ గారికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో మహిళా కాంగ్రెస్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మహిళలను కాంగ్రెస్ పార్టీ పట్ల మరింత ఆకర్షితులను చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి మహిళకు చేరేలా కృషి చేయాలని నూతనంగా నియమితులైన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అన్నపూర్ణ కి సూచించారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖిజర్ పాషా, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్‌చార్జి గౌలి సంజీవ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మీర్జా ఇమ్రాన్ బేగ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరమేశ్వర్, లీగల్ సెల్ అధ్యక్షుడు మంగేష్ దేవతడే, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దేవిదాస్ చారి, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అక్తర్ అలీ, సేవాదళ్ నాయకుడు ఆఫ్సర్, పట్టణ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, వార్డు అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాలిక పై అత్యాచారం పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

• బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం పోలీసు సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) ఒ మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడటంతో పాటు , ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తానని బెదిరించిన నిందితుడికి నిజామాబాద్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి దుర్గాప్రసాద్ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని . అంతేకాకుండా బాధిత బాలికకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా రూ.5 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, ఐ.పి.యస్ తెలిపారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. బాధిత బాలిక 12 సంవత్సరాల వయస్సులో, ఐదవ తరగతి చదువుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాలిక కిరాణా దుకాణానికి వెళ్తున్న సమయంలో నిందితుడు ఆమె చేయి పట్టుకుని బలవంతంగా నిర్మాణంలో ఉన్న ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక భయపడి ఎవరికీ చెప్పలేదు.అనంతరం మూడు, నాలుగు రోజుల వ్యవధిలో మరోసారి బాలికను సమీపంలోని పాడుబడిన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా నాలుగు, ఐదు రోజుల వ్యవధిలో మరోసారి ఇదే విధంగా నేరానికి పాల్పడ్డాడు. నిందితుడి బెదిరింపుల కారణంగా బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేయలేకపోయింది.ఈ క్రమంలో 03-10-2021న బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లి వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. వైద్య పరీక్షల్లో బాలిక సుమారు ఆరు నెలల గర్భిణి అని వెల్లడైంది. దీంతో తల్లి వివరాలు అడిగి తెలుసుకోగా, నిందితుడు తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితురాలి తల్లి 15-10-2021న నిజామాబాద్ టౌన్-1 పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు క్రైమ్ నంబర్ 329/2021 కింద ఐపీసీ 376 ఏబీ, 506, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా బాధిత బాలిక వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర కీలకమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.ఈ కేసును విచారించిన నిజామాబాద్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి దుర్గాప్రసాద్, ఈ కేసులో 19-11-2026న నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమాన విధించారు. యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానతో పాటు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ1.10,000 జరిమానా విధించారు.అంతేకాకుండా బాధిత బాలికకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా రూ.5,00,000/- పరిహారం అందించాలని ఆదేశించింది. పోలీస్ కమిషనర్ అభినందనలు... ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు నిరంతరం కృషి చేశారు. కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు , కీలకమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ప్రవేశపెట్టడం , సాక్షులను సకాలంలో సమన్వయం చేసి న్యాయస్థానానికి హాజరుపరచడం వంటి అంశాల్లో సంబంధిత పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని, ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో నిందితుడికి తగిన శిక్ష పడింది. ఈ కేసులో మొదటి నుంచి చివరి వరకు నిర్విరామంగా కృషి చేసి, సాక్షులను సమన్వయం చేస్తూ, కోర్టు విచారణకు హాజరుపరచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసినసంబంధిత పోలీసు అధికారులను, సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐ.పి.యస్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

నేడు జిల్లాలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పర్యటన



• మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్ల పంపిణీ, లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత కార్యక్రమాలలో ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఇంచార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, డీఆర్డీఏ సాయన్న, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష

• అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్‌తో ఒకరి మృతికి కారణమైన నిందితుడు

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.2018 ఆగస్టు 29న ఆదిలాబాద్ నుంచి సవాపూర్ గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న అరికెలా రవి, బోయర్ వైభవ్ కృష్ణలను గుడిహత్నూర్‌కు చెందిన కేంద్ర సాంబాజీ తన మ్యాక్స్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ అరికెలా రవి మృతి చెందాడు. ఈ ఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, అప్పటి ఎస్ఐ తోట తిరుపతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన ఆదిలాబాద్ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జేఎఫ్‌సీఎం) న్యాయమూర్తి చింతల దివ్య వాణి సాక్ష్యాధారాలను, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహీన్ సుల్తానా వాదనలను పరిశీలించి నిందితుడు కేంద్ర సాంబాజీకి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి దర్యాప్తు అధికారి తోట తిరుపతి, ప్రస్తుత జైనథ్ ఎస్‌హెచ్‌ఓ పవార్ గౌతమ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహీన్ సుల్తానా, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం. సునీల్ (పీసీ 264) లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అభినందించారు.

వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

• డీఐఈఓ ఎండి కైసర్ పాషా



(బోథ్, సాక్షర) రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను సన్నద్ధం చేయవలసిందిగా ఆదిలాబాద్ నూతన డీఐఈఓ ఎండి కైసర్ పాషా అధ్యాపకులకు సూచించారు.బోథ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆదిలాబాద్ నూతన డీఐఈఓ ఎండి కైసర్ పాషా గురువారం ర ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను సన్నద్ధం చేయవలసిందిగా అధ్యాపకులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

• దేవాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

(కాసిపేట, సాక్షర) పోలీసులు విధుల నిర్వహణలో, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సూచించారు. గురువారం దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐ గంగారాంను కేసుల ఆన్‌లైన్ నమోదు, ఐటీటీ ఎస్ఓ కేసులు, ఈ-సాక్ష్య, ఈ-సమన్ల అమలు, దర్యాప్తులో ఉన్న (యూఐ) కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ కలిగిన వ్యక్తులు, ఇతర నేర చరిత్ర ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ మేనేజ్‌మెంట్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, స్టేషన్‌లో విధులు నిర్వహించే ప్రతి అధికారి, సిబ్బంది సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు, వ్యాపారులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించి, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు.


మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



(కడెం, సాక్షర) మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కడెం మండలం లక్ష్మీపూర్ (నవాబుపేట) గ్రామంలో నూతనంగా నిర్మించిన వివో భవనాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#RaPo23 ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్ మూవీ ప్రీ లుక్ రిలీజ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ #RaPo23 ప్రీ-లుక్‌ను 'ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో ఇంటర్నేషనల్ మెన్స్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ఆసక్తికరంగా ఉన్న ఈ పోస్టర్ సినిమా కథ, రామ్ పాత్రపై క్యూరియాసిటీ పెంచుతోంది. ప్రీ-లుక్ పోస్టర్‌లో రామ్ చాలా మిస్టీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. భారీ నిర్మాణంతో ఉన్న ఓ ఆర్కిటెక్చరల్ బిల్డింగ్‌లో మెట్లపై కెమెరాకు వెనుకవైపు తిరిగి నిలబడి ఉన్నారు. బ్లాక్ డ్రెస్‌లో, వెనుక భాగంలో V ఆకారంలో చిన్నగా కట్ చేసిన హెయిర్ స్టైల్‌తో కనిపిస్తున్నారు. తల వెనుక భాగంలో ఉన్న ప్రత్యేకమైన టాటూ ఆయన లుక్‌కు మరింత రఫ్‌నెస్ తీసుకొచ్చింది. ఒక చేతిలో గన్, మరో చేతిలో టెడ్డీ బేర్ పట్టుకుని ఉండటం ఆసక్తికరంగా ఉంది. గన్, టెడ్డీ బేర్ మధ్య ఉన్న ఈ కాంట్రాస్ట్ ఆయన పాత్రలోని మరో కోణంపై ఆసక్తిని పెంచుతోంది. భారీ జామెట్రిక్ నిర్మాణాలు, గ్రే కలర్ బ్యాక్‌డ్రాప్ పోస్టర్‌కు మరింత ఇంటెన్స్ లుక్‌ను ఇచ్చాయి. ఈ సినిమాలోని ప్రధాన పాత్రను పరిచయం చేస్తూ 'లోన్ వుల్ఫ్' అనే పదానికి మేకర్స్ ఓ ఆసక్తికరమైన నిర్వచనం కూడా ఇచ్చారు. "తన దారిని తానే ఎంచుకుని, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి" అనేది దాని అర్థం. వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, తనదైన ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లే వ్యక్తి చుట్టూ ఈ కథ సాగనుందని ఈ కాన్సెప్ట్ సూచిస్తోంది. ఇది ఇంటెన్స్, క్యారెక్టర్ డ్రివెన్ కథగా ఉండబోతోందనే ఆసక్తిని కలిగిస్తోంది. ఇంటర్నేషనల్ మెన్స్ డే సందర్భంగా ఈ ప్రీ-లుక్‌ను రిలీజ్ చేయడం కూడా ప్రత్యేకతను తీసుకొచ్చింది. జనాలకు భిన్నంగా తనదైన దారిలో నడుస్తూ, తన నమ్మకాల కోసం నిలబడే వ్యక్తి స్వభావాన్ని 'లోన్ వుల్ఫ్' ఫిలాసఫీ ప్రతిబింబిస్తోంది. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తుండటం కూడా ఈ కాన్సెప్ట్‌తో ఆసక్తికరంగా అనిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమాతో ఆయన తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుకరసు (తిరు) సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్, పీటర్ హెయిన్, విక్రమ్ మోర్, కెవిన్ యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ప్రస్తుతం విడుదలైన ప్రీ-లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. రామ్ దర్శకుడిగా మారడం, 'లోన్ వుల్ఫ్' చుట్టూ అల్లుకున్న మిస్టీరియస్ ప్రపంచం #RaPo23ను ప్రస్తుతం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుపుతున్నాయి. నటీనటులు: రామ్ పోతినేని, రితేష్ దేశ్‌ముఖ్, సంయుక్త

ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు "క్రేజీ కల్యాణం" సినిమా



'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందించారు. గత నెల 16న థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "క్రేజీ కల్యాణం" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా ఆహా ఓటీటీ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. తెలుగుతో పాటు తమిళంలో ఈ సినిమా ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. ఆహా గోల్డ్ సబ్ స్క్రైబర్స్ ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయొచ్చు. యూనివర్సల్ ఎమోషన్స్ ఉన్న మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా క్రేజీ కల్యాణం సినిమా అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు ఆహా ఓటీటీతో మరింత మంది ప్రేక్షకులకు ఈ సినిమా చేరువ కానుంది. నటీనటులు - 'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు

"రాజిగాడు రాజయ్యాడు" సినిమా టీజర్ లాంచ్



"బట్టల రామస్వామి బయోపిక్కు" సినిమా ద్వారా తెలుగు ఆడియెన్స్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో అల్తాఫ్ హసన్. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తూ "రాజిగాడు రాజయ్యాడు" అనే కొత్త చిత్రాన్ని మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాను శర్మాస్ ఫిలింస్ బ్యానర్ పై బత్తుల పర్విన్, మనోజ్ అర్రోల, చిన్ని నిర్మిస్తున్నారు. "రాజిగాడు రాజయ్యాడు" మూవీలో అను శ్రీ హీరోయిన్ గా నటిస్తుండగా, ప్రముఖ కవి, గాయకుడు డా. గోరటి వెంకన్న కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ రోజు "రాజిగాడు రాజయ్యాడు" సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు కేశవ మాట్లాడుతూ - మంచి కాన్సెప్ట్, స్టోరీతో వస్తున్న చిత్రమిది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను మీరు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమాను కూడా సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. నటుడు అశోక్ రెడ్డి మాట్లాడుతూ - ఈ సినిమా టైటిల్ లోనే ఒక రిథమ్ ఉంది. ఈ టైటిల్ ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుందని నమ్ముతున్నాను. నేను ఈ చిత్రంలో హీరోయిన్ తండ్రి పాత్రలో నటిస్తున్నాను. ఇలాంటి మంచి రోల్ ఇచ్చిన డైరెక్టర్ అల్తాఫ్ గారికి థ్యాంక్స్. అన్నారు. నటుడు శివకుమార్ కాముని మాట్లాడుతూ - అప్పట్లో టి కృష్ణ గారి సినిమాలు ఎలా ఉండేవో అలా సామాజిక చైతన్యాన్ని కలిగించే చిత్రమిది. ఈ సినిమాలో నేను విలన్ బావమరిది క్యారెక్టర్ లో నటిస్తున్నాను. మీ ఆదరణ కోరుతూ త్వరలోనే మా మూవీ ముందుకు రాబోతోంది. అన్నారు. నటుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ - ఫేమస్ అయిన ఆర్టిస్టులతోనే సినిమాలు చేయాలని మేకర్స్ కోరుకుంటారు. కానీ మాలాంటి రంగస్థల నటులతో సినిమా చేసినందుకు మా డైరెక్టర్ హీరో అల్తాఫ్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. అన్నారు. నటుడు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ - ఈ సినిమా టైటిల్ లోనే మీకు కథ ఎలా ఉండబోతుందో తెలుస్తోంది. మేము షూటింగ్ చేసేప్పుడే అక్కడ ఉన్న వాళ్లు అందరూ చాలా బాగుందని చెప్పేవారు. ఈ సినిమా కోసం అల్తాఫ్ అన్న చాలా కష్టపడ్డారు. అన్నారు. నటి విజయలక్ష్మి మాట్లాడుతూ - ఈ సినిమాలో నాకు మంచి క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ అల్తాఫ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. నేను గతంలో కిష్కిందపురి సినిమాలో ఘోస్ట్ రోల్ లో చేశాను. ఈ చిత్రంతో నటిగా మరింత గుర్తింపు దక్కుతుందని ఆశిస్తున్నా. అన్నారు. డైలాగ్ రైటర్ రమేష్ మాట్లాడుతూ - నేను ఇష్క్, దృశ్యం 2 చిత్రాలకు డైలాగ్ రైటర్ గా వర్క్ చేశాను. నేను ఈ సినిమాకు వర్క్ చేయాలని అల్తాఫ్ అడిగారు. ఈ చిత్రంలో నేను రాసిన డైలాగ్స్ గోరటి వెంకన్న లాంటి ఆర్టిస్టులు చెప్పినప్పుడు ఎంతో హ్యాపీగా ఫీలయ్యాను. అన్నారు. లిరిసిస్ట్ లక్ష్మణ్ మాట్లాడుతూ - ఈ చిత్రంలో ట్యూన్ ను స్టూడియోలోనే వింటూ లైవ్ లో పాట రాశాను. ఇదొక ప్రయోగం అనుకోవచ్చు. లిరిసిస్ట్ గా గోరటి వెంకన్న గారితో పాటు నా పేరు టైటిల్స్ లో చూసుకోవడం గర్వంగా ఉంది. గోరటి వెంకన్న గారి అభిమానులంతా ఈ సినిమాను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. స్క్రిప్ట్ రైటర్ సూర్యారావు మాట్లాడుతూ - బహుజన వర్గాల ప్రజలంతా మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా. ఇది నాటకంగా ప్రదర్శించినప్పుడు ఎంతోమంది ప్రశంసలు లభించాయి. సినిమాకు కూడా అలాగే మీ అందరి అభినందనలు దక్కాలి. అన్నారు. స్టోరీ రైటర్ డి.విజయభాస్కర్ మాట్లాడుతూ - నాటక రచయితను నేను. ఈ చిత్రంలో అల్తాఫ్ నన్ను సినిమా రైటర్ గా మార్చారు. గ్రామాల్లో ఆధిపత్యం ఎవరిది ఉంటుందో మనకు తెలుసు. బడుగులంతా చైతన్యవంతమై అలాంటి ఆధిపత్యం మీద తిరగబడితే ఎలా ఉంటుందో మా సినిమాలో చూస్తారు. అన్నారు. ఎడిటర్ సతీష్ రాజా మాట్లాడుతూ - ఈ సినిమాకు వర్క్ చేయడం గర్వంగా ఉంది. మా సినిమాలోని కంటెంట్ అంతా చూస్తే ఇది నేషనల్ అవార్డ్ సాధిస్తుందని నమ్మకం ఉంది. అంత గుర్తింపు దక్కేలా మీరు సపోర్ట్ చేయాలని కోరుతున్నా. అన్నారు. డీవోపీ పీఎస్ మణికర్ణన్ మాట్లాడుతూ - అల్తాఫ్ గారితో నేను చేస్తున్న రెండో చిత్రమిది. సినిమాకు అందరూ కష్టపడే పనిచేస్తారు. కానీ అల్తాఫ్ తనకు ఏ వనరులు లేని పరిస్థితుల్లోనూ మంచి సినిమా చేశారు. అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ - సామాజిక చైతన్యానికి నాంది పలికే చిత్రమిది. మన దేశంలో ఆరు లక్షలకు పైగా గ్రామాలున్నాయి. ప్రతి గ్రామంలోనూ సమన్యాయం జరగాలనే ఆకాంక్ష ఈ చిత్ర కథాంశంలో మనకు కనిపిస్తుంటుంది. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలి. అన్నారు. నటుడు సంజయ్ గౌడ్ మాట్లాడుతూ - ఈ సినిమా రూటెడ్ గా నేచురల్ గా ఉంటుంది. కథ జరిగే లొకేషన్స్ కూడా చాలా సహజంగా ఉంటూ ఆకట్టుకుంటాయి. అల్తాఫ్ పర్ఫెక్షన్ కోరుకుంటాడు. చేసే సినిమా అందరికీ నచ్చాలని నమ్ముతాడు. ఇదొక ఫెంటాస్టిక్ మూవీగా పేరు తెచ్చుకుంటుంది. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ జగదీశ్ సత్యన్ మాట్లాడుతూ - ఈ సినిమాలో 7 పాటలు ఉంటాయి. దానిలో ఒక సాంగ్ గోరటి వెంకన్న గారు రాశారు. మిగతావి లక్ష్మణ్ రాశారు. గోరటి గారితో వర్క్ చేయడాన్ని గౌరవంగా భావించాను. ఈ చిత్రంలో కొత్త తరహా మ్యూజిక్ వింటారు. అన్నారు. నటి అను శ్రీ మాట్లాడుతూ -నేను గతంలో దేవగుడి అనే చిత్రంలో నటించాను. ఆ సినిమాలో రాయలసీమ అమ్మాయిగా కనిపించాను. ఈ చిత్రంలో తెలంగాణ అమ్మాయి పాత్రలో నటిస్తున్నాను. నేను వాస్తవంగా కోనసీమ అమ్మాయిని. ఈ సినిమాకు మంచి టీమ్ పనిచేశారు. అప్పట్లో జయసుధ, విజయశాంతి గారి క్యారెక్టర్స్ ను డైరెక్టర్ ఎలా డిజైన్ చేశారు. ఈ చిత్రంలో నా పాత్రను అల్తాఫ్ గారు అలా డిజైన్ చేశారు. మీ అందరికీ మా మూవీ బాగా నచ్చుతుంది. అన్నారు. నిర్మాత చిన్ని మాట్లాడుతూ - రెండేళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ మొదలైంది. నేను ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ నుంచీ ఉన్నాను. నేను సినిమాలను ఇష్టపడతా. అయితే నేనే ప్రొడ్యూసర్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. సినిమా ప్రీ ప్రొడక్షన్ నుంచి కంప్లీట్ అయ్యేవరకు జరిగే జర్నీ నేను చూశాను. దాంతో నాకు సినిమాల మీద గౌరవం మరింత పెరిగింది. మా టీమ్ లోని ప్రతి ఒక్కరి సపోర్ట్ వల్లే అడ్డంకులు దాటుకుని ఇక్కడిదాకా వచ్చాం. సినిమా బాగా వచ్చింది. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది. అన్నారు. హీరో, డైరెక్టర్ అల్తాఫ్ హసన్ మాట్లాడుతూ - మా ప్రొడ్యూసర్ చిన్ని వల్లే మా అందరి కల నిజమవుతోంది. విజయ్ భాస్కర్ గారు రాసిన నాటకం ఈ సినిమాకు మూలం. ఆయనతో మూడు నెలల పాటు స్క్రిప్ట్ డిస్కషన్స్ చేసి సినిమాకు కథను అడాప్ట్ చేసుకున్నాం. పల్లె కన్నీరు పెడుతుందో అనే గొప్ప పాట రాసిన గోరటి గారే ఈ సినిమాకు అలాంటి పాట రాయగలరని ఆయనను అప్రోచ్ అయ్యాం. మా నాన్న పాత్ర కూడా ఆయనే చేయాలని కోరాం. ఈ సినిమాకు వర్క్ చేసిన వాళ్లు నా ఫ్యామిలీలా భావిస్తా. మా మూవీకి జగదీశ్ ఏడు ఆణిముత్యాల్లాంటి పాటలు అందించారు. ఆ పాటలు మా సినిమాకు సోల్ లా మారాయి. మా డీవోపీ బ్యూటిఫుల్ విజువల్స్ ఇచ్చారు. గొప్ప పర్పస్ ఉన్న ఇన్స్ పైరింగ్ మూవీ ఇది. మీరంతా మా ప్రయత్నాన్ని ప్రోత్సహించాలని కోరుకుంటున్నా. అన్నారు. గీత రచయిత, నటుడు డా.గోరటి వెంకన్న మాట్లాడుతూ - చిన్న సినిమా పెద్ద సినిమా అనే బేధాలు కొందరు సృష్టించినవి. కానీ కళ అయిన సినిమాకు అలాంటి బేధం లేదు. ఇతర భాషల చిత్రాలు ఆ బేధాలు చెరిపేస్తున్నాయి. తెలుగులో కూడా ఆ మార్పు వస్తుంది. ఈ చిత్ర కథా రచయిత ఎన్నో గొప్ప అవార్డ్స్ పొందిన వారు. ఆయన నాటకం కూడా నంది పురస్కారాలు పొందింది. అలాంటి గొప్ప కథను ఈసినిమాకు ఎంచుకున్నారు అల్తాఫ్. నేను ఈ సినిమాను మూడు సార్లు చూశా ఎప్పుడూ బోర్ రాలేదు. కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఈ మూవీలో ఉంటాయి. మూస చిత్రాలు భిన్నంగా అల్తాఫ్ ఒక చరిత్ర సృష్టించబోతున్నాడు. ఈ సినిమాలో నేనొక మంచి క్యారెక్టర్ కూడా చేశాను. ఈ సినిమా రాజకీయ నేపథ్యంతో రావడం లేదు. ఒక జీవితాన్ని చూసిన ఫీల్ కలిగిస్తుంది. ఏ ప్రాంతం నేపథ్యంతో వస్తున్న కథైనా మనకు హార్ట్ టచింగ్ గా ఉండాలి. మనసును తాకే ఆ తరహా కథతో వస్తున్న ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలి. అన్నారు. నటీనటులు - అల్తాఫ్ హసన్, అను శ్రీ, డా. గోరటి వెంకన్న, గీతా అగర్వాల్, రాజేంద్ర మోహన్ నను, శ్రీవర్ధన్ త్రివేది, సుజాత దీక్షిత్, గోవర్ధన్ రెడ్డి, సంజయ్ గౌడ్, డా. శివకుమార్ కాముని, తదితరులు

మోసపోయాం జానకి" సినిమా టైటిల్ ఇంట్రెస్టింగ్ గా ఉంది

- డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా



సాయి సోహన్, విస్మయ శ్రీ , విష్ణు ఓయ్, నరేంద్ర రవి, హరితేజ, జీవన్ కుమార్, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా

"మోసపోయాం జానకి". ఈ చిత్రాన్ని నిసా ఎంటర్ టైన్ మెంట్స్, సెవెన్ క్రియేషన్స్ బ్యానర్స్ తమ ప్రొడక్షన్ నెం.3 గా నిర్మిస్తున్నాయి. ఇటీవల అనౌన్స్ చేసిన ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఈ సినిమా పోస్టర్ ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. "మోసపోయాం జానకి" టైటిల్ ఇంట్రెస్టింగ్ గా ఉందంటూ ఆయన తన బెస్ట్ విషెస్ అందించారు. "మోసపోయాం జానకి" సినిమాను క్రైమ్ కామెడీ జానర్ లో మంచి ఎంటర్ టైన్ మెంట్ తో దర్శకుడు మధుసూధన్ రెడ్డి గోపు రూపొందిస్తున్నామని, రిచ్ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మాతలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. నటీనటులు – సాయి సోహన్, విస్మయ శ్రీ , విష్ణు ఓయ్, నరేంద్ర రవి, అజయ్, హరితేజ, జీవన్ కుమార్, మురళీధర్ గౌడ్, మాణిక్ రెడ్డి, తదితరులు

'టైసన్ నాయుడు' సినిమా యాక్షన్ రైడ్ టీజర్ రిలీజ్



యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సాగర్ కె చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు చూడని డిఫరెంట్ మాస్ అవతార్‌లో ఆయన కనిపిస్తుండటంతో ఈ సినిమా ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకమైన పాత్రగా నిలవనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తుండగా, హరీష్ కట్ట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ 'మదరాసి రబ్బరు బొమ్మ' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. జానపద బీట్స్, రిచ్ విజువల్స్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్‌తో ఈ పాట ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తాజాగా మేకర్స్ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ టీజర్ అదిరిపోయే యాక్షన్ రైడ్‌ను ప్రామిస్ చేస్తోంది. పోలీసుల విభాగంలో SOT (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్) పేరుతో ఒక ప్రత్యేకమైన ఫాంటమ్ వింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇబ్బందులు సృష్టించే వ్యక్తులు, పదే పదే నేరాలకు పాల్పడే వారిని తమదైన పద్ధతుల్లో ఎదుర్కోవడం ఈ టీమ్ పని. సాధారణ పోలీసు విధానాలకు భిన్నంగా పనిచేసే ఈ టీమ్, అరెస్టులు చేయకుండా, అధికారిక రికార్డులు నిర్వహించకుండా అక్కడికక్కడే శిక్షించే విధానాన్ని అనుసరిస్తుంది. మరోవైపు నగరంలో వరుసగా జరుగుతున్న నేరాలు ఆందోళన కలిగిస్తాయి. వాటి వెనుక భారీ కుట్ర జరుగుతోందని కథానాయకుడు గుర్తిస్తాడు. 'అప్పట్లో ఒకడుండేవాడు', 'భీమ్లా నాయక్' వంటి సినిమాలతో తన ప్రతిభను నిరూపించుకున్న సాగర్ కె చంద్ర, ఈసారి ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌తో వస్తున్నారు. టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ, అసలు కథను పూర్తిగా బయటపెట్టకుండా ప్రధాన సంఘర్షణ చుట్టూ ఉత్కంఠను పెంచుతుంది. అనీత్, ముకేష్ జ్ఞానేష్ సినిమాటోగ్రఫీ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌ను చాలా రా అండ్ గ్రిటీగా చూపించింది. భీమ్స్ సిసిరోలియో అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టెన్షన్‌ను మరింత పెంచింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన యాక్షన్ హల్క్ ఇమేజ్‌కు తగ్గట్టుగా స్పెషల్ ఆఫీసర్ పాత్రలో అదరగొట్టారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ పాత్రకు మంచి బలాన్ని ఇచ్చాయి. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రజ్ఞా జైస్వాల్ కనిపించిన తీరు ఆమె పాత్రలో ఏదో మిస్టరీ ఉందనే ఆసక్తిని కలిగిస్తోంది. నరేష్, సునీల్, రావు రమేష్ పాత్రలకు సంబంధించిన కొన్ని షాట్స్ టీజర్‌లో ఆసక్తికరంగా ఉన్నాయి. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. విజయ్ పోలాకి, భాను మాస్టర్స్ రూపొందించిన యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి. మొత్తంగా 'టైసన్ నాయుడు' టీజర్ హై ఆక్టేన్ యాక్షన్, క్రైమ్, సస్పెన్స్ డిఫరెంట్ కథాంశం, ఇంటెన్స్ ప్రెజెంటేషన్, పవర్‌ఫుల్ యాక్షన్ బ్లాక్స్‌తో సినిమాపై అంచనాలను మరింత పెంచింది. నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి, ప్రజ్ఞా జైస్వాల్, నరేష్, సునీల్, రావు రమేష్

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com